పది తగ్గి.. ఒకటి పెరిగి..!

19 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లీ

టెన్త్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు మే 19వ తేదీ నుంచి 28వ తేదీ వరకూ నిర్వహించనున్నారు. ఈ నెల 24 నుంచి 30వ తేదీ వరకూ పరీక్ష ఫీజు చెల్లించవచ్చు. రూ.50 ఫైన్‌తో మే 1వ నుంచి 18వ తేదీ వరకూ ఫీజు చెల్లించవచ్చు. రీ కౌంటింగ్ కోరుకునే విద్యార్థులు ఒక్కో సబ్జెక్టుకు రూ.500, రీ వెరిఫికేషన్ కోరుకునే విద్యార్థులు ఒక్కో సబ్జెక్టుకు రూ.1000 చొప్పున ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

పబ్లిక్ పరీక్షల్లో 70.07 శాతం ఉత్తీర్ణత

రాష్ట్రస్థాయిలో 23వ స్థానంలో అనంత

గత ఏడాది 80.93 శాతంతో 24వ స్థానం

30,700 మందిలో 21,510 మంది ఉత్తీర్ణత

బాలికలు 11,195, బాలురు 10,315 మంది పాస్

మే 19 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు



జిల్లా టెన్త్ ఫలితాలు వెల్లడిస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు, ఏసీ గోవింద్ నాయక్, ఏడీ, ఎంఈఓ

అనంతపురం విద్య, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఈ ఏడాది జిల్లా ర్యాంకు మెరుగుపడింది. కానీ ఉత్తీర్ణత శాతం బాగా తగ్గింది. గత ఏడాది 80.93 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 24వ స్థానంలో నిలిచిన అనంత.. ఈ ఏడాది 70.07 శాతం ఉత్తీర్ణతతో 23వ స్థానానికి చేరడం గమనార్హం. ఉత్తీర్ణత పది శాతం తగ్గిందని బాధపడాలో.. ర్యాంకింగ్‌లో ఒక మెట్టు ఎక్కి.. 23వ స్థానంలో నిలిచామని సంబరపడాలో తెలియని పరిస్థితి విద్యాశాఖ అధికారులది. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 30,700 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 21,510 మంది పాసయ్యారు. వీరిలో ప్రథమ శ్రేణిలో 16,443 మంది, ద్వితీయ శ్రేణిలో 3,299 మంది, తృతీయ శ్రేణిలో 1,768 మంది సాధించారు. బాలికలు 14,967 మంది పరీక్షలకు హాజరు కాగా 11,195 మంది పాసయ్యారు. బాలురు 15,733 మంది హాజరు కాగా 10,315 మంది పాసయ్యారు. బాలికల ఉత్తీర్ణత శాతం 74.80 కాగా, బాలుర ఉత్తీర్ణత శాతం 65.56 నమోదైంది. పదో తరగతి ఫలితాల్లో జిల్లా ఒక స్థానం పెరిగిందని డీఈఓ ప్రసాద్‌బాబు, ఏసీ గోవింద్ నాయక్ తెలిపారు. కేఎస్ఆర్ హైస్కూల్‌లోని క్యాంపులో ఏడీ క్రిష్ణయ్య, ఎంఈఓ వెంకటస్వామితో కలసి వారు జిల్లా ఫలితాలను బుధవారం ప్రకటించారు.

ఓపెన్ డీలా

ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ ఫలితాల్లో జిల్లా డీలా పడింది. పదో తరగతి ఓపెన్‌లో 955 మంది పరీక్షలు రాయగా కేవలం 50 మంది పాసయ్యారు. జిల్లాకు 5.24 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 23వ స్థానం దక్కింది. ఓపెన్ ఇంటర్‌లో 2,795 మందికి గానూ 633 మంది పాసయ్యారు. 22.65 శాతం ఉత్తీర్ణతతో జిల్లాకు 22వ స్థానం దక్కింది.

కేజీబీవీల్లో టాప్ మార్కులు

587 : ఏపీసీ శైలజ

జిల్లాలోని కేజీబీవీల్లో 72 శాతం ఉత్తీర్ణత నమోదైందని సమగ్రశిక్ష ఏపీసీ శైలజ తెలిపారు. మొత్తం 1217 మంది విద్యార్థులకుగాను 887 మంది పాసయ్యారని ఆమె తెలిపారు. గుత్తి కేజీబీవీలో వందశాతం ఉత్తీర్ణత నమోదైందని, కేజీబీవీల్లో 500 పైగా మార్కులు 88 మంది సాధించారని తెలిపారు. రాయదుర్గం విద్యార్థిని అక్షయ 587 మార్కులతో జిల్లాలోని కేజీబీవీ విద్యార్థుల్లో టాపర్‌గా నిలిచారని తెలిపారు. భార్గవి 584 మార్కులు, కావ్య 578 మార్కులు సాధించి తర్వాత స్థానాల్లో నిలిచారని ఏపీసీ పేర్కొన్నారు.

గత ఐదేళ్లలో పదో తరగతి ఫలితాలు

ఏడాది	హాజరైన విద్యార్థులు	పాసైన విద్యార్థులు	ఫెయిలైన విద్యార్థులు	ఉత్తీర్ణత శాతం	జిల్లాకు దక్కిన స్థానం
2020-21	52,304	52304 (కొవిడ్ పాస్)	0	100	--
2021-22	50,554	25,126	25,428	49.70	చివరి స్థానం
2022-23	29,666	19,654	10,012	66.25	20వ స్థానం
2023-24	30,893	25,003	5890	80.93	24వ స్థానం
2024-25	30,700	21,510	9,190	70.07	23వ స్థానం



రెనీలప్రియ



లక్ష్మీప్రసన్న



వికాస్‌రెడ్డి



దీక్షిత్



శోభిక లక్ష్మి

596 అదుర్స్

జిల్లాలో పలువురు విద్యార్థులు 596 మార్కులు సాధించారు. జిల్లాలో ఈ ఏడాది ఇవే టాప్ మార్కులు. 595, 594 మార్కులు సాధించిన విద్యార్థులు కూడా గణనీయంగా ఉండటం విశేషం. 593 మార్కులైతే వందలాది మంది సాధించారు.

- అనంతపురం అశోక్ నగర్‌లోని భీమలింగ, రాధ దంపతుల కూతురు రెనీల ప్రియ 596 మార్కులు సాధించింది. రెనీల ఒకటి నుంచి పదో తరగతి వరకూ మినర్వా ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో చదివింది. పాఠశాల కరస్పాండెంట్ విద్యార్థినిని అభినందించారు.
- శ్రీచైతన్య విద్యాసంస్థలలో ఆరుగురికి 596 మార్కులు వచ్చాయి. అనంతపురం నగర శివారు బ్రాంచి విద్యార్థులు లక్ష్మీ ప్రసన్న, వికాస్ రెడ్డి, గుంతకల్లు విద్యార్థి దీక్షిత్, హిందూపురం విద్యార్థిని శోభిత, అనంతపురం విద్యార్థి రోహిత్ సాయి, గోరంట్ల విద్యార్థి వివేకానందరెడ్డి 596 మార్కులు సాధించారు. తల్లిదండ్రులు, శ్రీచైతన్య విద్యాసంస్థల ఏజీఎం సుబ్బారెడ్డి వీరిని ప్రత్యేకంగా అభినందించారు.
- అనంతపురం ద్వారకా నగర్‌లోని నారాయణ స్కూల్ విద్యార్థిని వినమ్ర 596 మార్కులు సాధించింది. ప్రణవి 595 మార్కులు సాధించింది. ఏజీఎం, ప్రిన్సిపాళ్లు అభినందించారు.
- అనంతపురం సెవెన్‌హిల్స్ కాలనీలోని రావూస్ స్కూల్ విద్యార్థి బెల్లం రామ్ చరణ్ 595 మార్కులు సాధించాడు. బాల్యం నుంచే అదే స్కూల్‌లో చదువుతున్నాడని, 595 మార్కులు రావడం సంతోషంగా ఉందని తల్లిదండ్రులు ఆదినారాయణ, కళావతి, స్కూల్ కరస్పాండెంట్ మాధవరావు తెలిపారు.



రోహిత సాయి



వివేకానందరెడ్డి



రామ్ చరణ్



వినమ్ర



ప్రణవి

ప్రభుత్వ బడిలో 593

జిల్లాలోని మున్సిపల్, జడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పలువురు 593, 592 మార్కులు సాధించారు. ప్రైవేటు పాఠశాలల్లో టాప్ మార్కులు 596 కాగా.. వారికి దీటుగా 593 మార్కులతో మెరిశారు. జిల్లాలోని ప్రభుత్వ, మండల పరిషత్, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, బీసీ, ట్రైబల్, సోషల్, మైనార్టీ వెల్ఫేర్, మోడల్ స్కూల్, కేజీబీవీ విద్యార్థులు 18,893 మంది పరీక్షలు రాశారు.



- గుత్తి మోడల్ స్కూల్ విద్యార్థి గజం శెట్టి నరసింహ 593 మార్కులు సాధించాడు. జిల్లాలో 15 మోడల్ స్కూళ్ల పరిధిలో 1,261 మంది పరీక్షలు రాశారు. నరసింహ టాపర్‌గా నిలిచాడు. తండ్రి మద్దిలేటి మరణించగా, తల్లి కళావతి కూలి పని చేస్తూ కొడుకును చదివిస్తోంది. నరసింహ కష్టపడి టాప్ మార్కులు సాధించాడు.




- అనంతపురం రాజేంద్ర మున్సిపల్ హైస్కూల్ విద్యార్థి బత్తల హర్షవర్ధన్ 592 మార్కులు సాధించాడు. తల్లి పావని గృహిణి కాగా, తండ్రి లోకేశ్ ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తన కుమారుడిని ఉపాధ్యాయులు బాగా ప్రోత్సహించారని లోకేశ్ కృతజ్ఞతలు తెలిపాడు. ట్రిపుల్ ఐటీలో చదివించాలని అనుకుంటున్నానని అన్నాడు.



- అనంతపుం కేఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని గోస్రుజా 982 మార్కులు సాధించింది. గోస్రుజా 8వ తరగతి నుంచి ఇదే స్కూల్‌లో చదువుతోంది. విద్యార్థినిని డీఈఓ ప్రసాద్‌బాబు, హెచ్ఎం నారాయణ ప్రత్యేకంగా అభినందించారు. శారదా మున్సిపల్ హైస్కూల్ విద్యార్థి తనూశ్రీ 591 మార్కులు సాధించింది.

మేఘాలలో తేలిపోయే చాన్స్



ఎంఈవో మల్లారెడ్డి

బెళుగుప్ప: ప్రభుత్వ పాఠశాలల్లో 570 మార్కులు సాధించిన విద్యార్థులను సొంత డబ్బుతో విమానం ఎక్కిస్తానని పరీక్షల సమయంలో ప్రకటించిన ఎంఈవో మల్లారెడ్డి.. బుధవారం మరో మినహాయింపునిచ్చారు. మండలంలో మంచి ఫలితాలు వచ్చాయని, 550 పైగా మార్కులు వచ్చిన వారిని కూడా విమానం ఎక్కిస్తానని తెలిపారు. ఈ జాబితాలో ఐదుగురు విద్యార్థులు ఉన్నారు. వీరు బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు విమానంలో వెళ్లే బంపర్ ఆఫర్ కొట్టేశారు.

హిస్టరీ రిపీట్



కుందుర్పి: ఎనుములదొడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998లో పదో తరగతి పరీక్షలు రాసిన మంజుల.. 402 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచారు. ఇన్నేళ్ల తరువాత ఆమె కూతురు సింధు హిస్టరీని రిపీట్ చేశారు. 562 మార్కులతో పాఠశాల టాపర్‌గా నలిచారు. ఆమె కవల సోదరి ప్రియాంక సైతం 554 మార్కులు సాధించడం విశేషం. దీంతో తల్లి మంజుల, తండ్రి బసవరాజు సంతోషంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు. ఉపాధ్యాయులు, గ్రామస్థులు వారిని అభినందించారు.

సీతయ్యలాంటి సీఐ.. వీఆర్‌కు..!



ఆయన ఎవరి మాటా వినరు..! 'రూల్ ఈజ్ రూల్.. రూల్ ఫర్ ఆల్' అన్నట్లు వ్యవహరిస్తారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే.. ఎవరనేది చూడకుండా చట్టాన్ని అమలు చేస్తారు. మరీ ముఖ్యంగా.. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడితే ఎవరి నుంచి ఫోన్ కాల్స్ వచ్చినా లొంగరు. కేసు రాసేస్తారు.. జరిమానా విధిస్తారు. ఆయన పేరు రఘు ప్రసాద్. అనంతపురం ట్రాఫిక్ సీఐగా పనిచేసేవారు. ట్రాఫిక్‌లో ఇలాంటి అధికారులే ఉండాలి. వారు విధించే జరిమానాలు బాధ కలిగించినా.. ఆ భయంతోనైనా వాహనదారులు పద్ధతి మార్చుకుని, క్షేమంగా ఇంటికి చేరగలుగుతారు. నిక్కచ్చిగా పనిచేసే ఈ అధికారిని ఉన్నతాధికారులు తగిన రీతిలో గౌరవించారు. 'ఇన్నాళ్లూ కష్ట పడ్డారు. పాపం.. వేసవి కాలంలో ఎండల్లో ఏం తిరుగుతారులే..' అన్నట్లు వీఆర్‌కు పంపి విశ్రాంతినిచ్చారు. ఆయన స్థానంలో వెంకటేశ్ నాయక్‌ను ట్రాఫిక్ సీఐగా నియమించారు. రఘుప్రసాద్ బుధవారం సాయంత్రం రిలీవ్ కాగా.. వెంకటేశ్ నాయక్ విధుల్లో చేరిపోయారు. వైసీపీ హయాంలోనూ ఈయన ఇక్కడే పనిచేశారు. రఘుప్రసాద్ 'సీతయ్య' క్యారెక్టర్‌లో ఉండటం, ఆయన సీటు కోసం పైరవీలు జరగడంతో 'వీఆర్' కానుకగా లభించిందని ప్రచారం జరుగుతోంది.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం క్రైం

పేరుకే సూపర్..!



ఇంట్లోవాళ్లే.. ఇలా తోసుకుపోవాల్సిందే..



అనంతపురం టౌన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో సౌకర్యాలు, సేవలు అధ్వానంగా ఉన్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అందుకు నిదర్శనమే ఈ ఫొటోలు. నడవలేని పేషెంట్లు ఆస్పత్రికి వస్తే వారిని వీల్‌చైర్లు, స్ట్రెచర్లలో తీసుకెళ్లాల్సిన ఎంఎన్ఓ, ఎఫ్ఎన్ఓలు కనిపించట్లేదు. దీంతో పేషెంట్ల కుటుంబసభ్యులే వీల్‌చైర్లు తీసుకుని, తోసుకెళ్తున్నారు. వాటిని తోయడంరాక కుటుంబసభ్యులు తిప్పలు పడుతున్నారు. బుధవారం ఆస్పత్రిలో ఈ దృశ్యాలు కనిపించాయి. అక్కడ పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది చూసీచూడనట్లుగా వ్యవహరించారు. లిఫ్టులు ఉన్నా ఒకటి మాత్రమే పనిచేస్తోంది. దీంతో పేషెంట్లు ఆ లిఫ్ట్ వద్దకే వెళ్లి, పైఅంతస్థులకు వెళ్లాల్సి వస్తోంది. ఆ విషయం తెలియని నడవలేని పేషెంట్లు మెట్లు ఎక్కలేక నానా తిప్పలు పడ్డారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలున్నా.. నిర్వహణ కరువైంది.

వైభవంగా శ్రీహరి కల్యాణం



సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

బొమ్మనహాళ్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణ మహోత్సవాన్ని బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయమే అర్చకులు ఆలయంలోని మూలవిరాట్‌కు సుప్రభాత సేవ, పలు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో శ్రీదేవి, భూదేవి సమేత స్వామి వారి ఉత్సవవిగ్రహాలను పట్టువస్త్రాలతో అలంకరించి వేదమంత్రోచ్చారణల నడుమ కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఉత్సవమూర్తులను ఉదయం సూర్య ప్రభ వాహనం, సాయంత్రం చంద్ర ప్రభ వాహనంపై ఊరేగించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఉగ్రమూకను అంతమొందించాలి

నినదించిన అనంత

బీజేపీ, వీహెచ్‌పీ, జనసేన, వైసీపీ నిరసన

అనంతపురం సెంట్రల్/క్రైం/ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): దొంగచాటుగా దేశంలోకి చొరబడి నరమేధం సృష్టించిన ఉగ్రమూకను అంతమొందించాలని వివిధ పార్టీల నేతలు నినదించారు. కశ్మీరు లోయలో ఉగ్రవాదుల కాల్పుల్లో మరణించిన వారికి బీజేపీ నాయకులు నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షుడు రాజేష్ ఆధ్వర్యంలో బుధవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదంపై పోరులో దేశమంతా ఒక్కటి కావాలని సీనియర్ నాయకుడు సందిరెడ్డి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు దుద్దకుంట వెంకటేశ్వరరెడ్డి, రత్నమయ్య పాల్గొన్నారు.

వీహెచ్‌పీ ఆధ్వర్యంలో..

విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నగరంలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. అమానవీయ దాడులకు తెగబడిన ఉగ్రవాదులకు తగిన బుద్ధి చెప్పాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో నాయకులు అశోక్‌రెడ్డి, లక్ష్మీదేవి, అజేష్ యాదవ్, నాగేంద్ర, ఇలియాజ్, చిరంజీవి, గిరిజాకుమారి, వివేక్ పాల్గొన్నారు.

జనసేన కన్నీటి నివాళి

జనసేన నగరాధ్యక్షుడు పొదిలి బాబురావు ఆధ్వర్యంలో ఉదయం పార్టీ కార్యాలయం వద్ద జెండా అవనతం చేశారు. సాయంత్రం నగరపాలక సంస్థ కార్యాలయం ముందు ఉగ్రదాడిలో మరణించిన వారికి నివాళులర్పించారు. అనంతరం కొవ్వొత్తులతో నగరంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు జయరాంరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ ఆధ్వర్యంలో..

ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ జడ్పీ కార్యాలయం ఎదుట ఉన్న అంబేడ్కర్ విగ్రహం నుంచి సప్తగిరి సర్కిల్ వరకు వైసీపీ నాయకులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మేయర్ మహమ్మద్ వసీం, డిప్యూటీ మేయర్లు విజయభాస్కర్ రెడ్డి, సాహిత్య, నాయకులు సోమశేఖర్ రెడ్డి, గౌస్ బేగ్, ఆలమూరు శ్రీనివాసరెడ్డి, సైఫుల్లాబేగ్ పాల్గొన్నారు.

పిరికిపంద చర్య

పహల్గాంలో ఉగ్రదాడి పిరికిపంద చర్య అని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. దాడిలో మరణించిన వారి కుటుంబాలకు సానుభూతి తెలిపారు. దాడికి పాల్పడిన వారిని క్షమించరాదని, వారికి బుద్ధి చెప్పాలని అన్నారు.



అనంతపురంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు



నగరపాలక సంస్థ కార్యాలయం ముందు సంతాపం తెలుపుతున్న జనసేన నాయకులు



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న వైసీపీ నాయకులు



ఉత్తుత్తి ఆత్మరక్షణ షో ఇస్తున్న కోచ్‌లు (ఫైల్)

ఆత్మరక్షణ పేరుతో నిధుల భక్షణ



అనంతపురం కలెక్టరేట్‌లో సంతకాల ఫోర్జరీపై చర్చిస్తున్న రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఏజెన్సీ నిర్వాహకులు



నీరుగారుతున్న కేంద్ర పథకం

రూ.కోటిపై కన్ను

- రెండు జిల్లాల్లోనూ నిధులకు ఎసరు
- ఫోర్జరీ సంతకాలతో తప్పుడు హాజరు నమోదు
- వైసీపీ హయాంలో రూ.5 కోట్లు హాంఫట్

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): బాలికలపై పెరుగుతున్న దాడుల నుంచి ఆత్మరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వ నిధులతో ప్రవేశపెట్టిన పథకం నిర్వీర్యమవుతోంది. ఆరో తరగతి నుంచి పదోతరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలికల్లో మానసిక స్థైర్యం, ఆత్మవిశ్వాసం పెంపొందించి ఆపదలో తనను తాను రక్షించుకోవడానికి ఆత్మరక్షణ కళలపై శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 'రాణి లక్ష్మీబాయ్ ఆత్మ రక్ష ప్రసిక్షణ్' పేరిట ఈ పథకాన్ని తీసుకువచ్చారు. ఇందుకు అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు రూ.50 లక్షల చొప్పున మొత్తం రూ.కోటి నిధులను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. జిల్లాలో ఎన్నడూ పేరు కూడా వినని హైదరాబాద్‌కు చెందిన రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఏజెన్సీకి అనంతపురం, విజయవాడకు చెందిన రూపేష్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీకి శ్రీసత్యసాయి జిల్లాల్లో ఆత్మరక్షణ కళల శిక్షణ బాధ్యతను కట్టబెట్టారు. ఇప్పటికే రెండు జిల్లాలకు చెరో రూ.14లక్షల చొప్పున రూ.28లక్షలు నిధులు కూడా మంజూరు చేశారు. మొదట ఒక్కో జిల్లాలో 167 మంది కోచ్‌లతో శిక్షణ ప్రారంభిస్తామని చెప్పిన ఏజెన్సీ నిర్వాహకులు నైపుణ్యత, అనుభవం లేని స్థానిక కోచ్‌లతో ఉత్తుత్తి శిక్షణ ప్రారంభించారు. అనంతపురం జిల్లాలో 495 ప్రభుత్వ పాఠశాలల్లో 48 వేల మంది బాలికలకు, శ్రీసత్యసాయి జిల్లాలో 480 పాఠశాలల్లో 45వేల మంది బాలికలకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. ఒప్పందం చేసుకుని మూడునెలలు కావస్తున్నా ఇప్పటి వరకు సగానికి పైగా స్కూళ్లల్లో ప్రారంభానికి నోచుకోలేకపోయింది. ప్రతి పాఠశాలలో కనీసం 20 క్లాస్‌లు నిర్వహించాల్సి ఉంది. ఉత్తుత్తి శిక్షణ ప్రారంభించిన స్కూళ్లలో కూడా పది తరగతులు నిర్వహించలేదు. వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు ఏడాదికి రూ.కోటి చొప్పున రూ.5 కోట్లు ఎలాంటి శిక్షణ ఇవ్వకుండానే నిధులను హాంఫట్ చేసేశారు.

ఫోర్జరీ సంతకాలతో హాజరు నమోదు

బాలికలకు ఆత్మరక్షణ కళల శిక్షణకు సంబంధించి ఫోర్జరీ సంతకాలతో తప్పుడు హాజరు నమోదు చేయడం వివాదంగా మారింది. అనంతపురం కేంద్రంగా ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఆత్మరక్షణ కళల పథకం నడిపిస్తున్నారు. కలెక్టరేట్లో రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఏజెన్సీ ప్రతినిధులు ఆయా పాఠశాలలు, ఆయా మండలాల ఎంఈఓల సంతకాలను ఫోర్జరీ చేస్తున్న ఓ వీడియో వైరల్‌గా మారింది. చాలా పాఠశాలల్లో శిక్షణ ప్రారంభించకనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంపై విమర్శలు వస్తున్నాయి. మార్చి 3 నుంచి 27వతేదీ వరకు శిక్షణ నిర్వహించాల్సి ఉంది. కోచ్‌లు లేక శిక్షణ ప్రారంభించలేదు. మొత్తానికి విద్యా సంవత్సరం పూర్తయిపోతోంది. శిక్షణ ఇవ్వకుండానే నిధులు కాజేసేందుకు యత్నిస్తున్నట్లు సమాచారం. రూ.కోటి నిధులు బూడిదలో పోసిన పన్నీరుగానే నిలిచిపోయే పరిస్థితి నెలకొంది. ఒప్పందం ప్రకారం 167మంది కోచ్‌లతో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ఎలాంటి నైపుణ్యంలేని 20 మంది స్థానిక ఉత్తుత్తి కోచ్‌లతోనే శిక్షణ ఇచ్చారు. ఉమ్మడి జిల్లాలో 975 ప్రభుత్వ పాఠశాలలకు గాను 400 స్కూళ్లలో మాత్రమే నామమాత్రంగా ప్రారంభించారు. ఇందులోనూ వంద స్కూళ్లలో పది తరగతులు కూడా నిర్వహించకపోవడం గమనార్హం.

ఆలస్యమైన మాట వాస్తవమే

కొన్ని అడ్డంకులతో బాలికలకు ఆత్మరక్షణ కళల శిక్షణ ఆలస్యమైన మాట వాస్తవమే. బాలికలకు ఉపయోగకరంగా ఉండేలా ఆత్మరక్షణ కళలపై శిక్షణ ఇస్తున్నాం. నిష్ణాతులైన కోచ్‌లు ఇందుకు అవసరమైన శిక్షణ, సాధన చేయిస్తున్నారు. విద్యాసంవత్సరం ప్రారంభం నుంచే నిర్వహించాల్సిన శిక్షణలు ఆలస్యంగా ప్రారంభించాం. ప్రతి పాఠశాలలో కనీసం 20 తరగతులు కచ్చితంగా శిక్షణ ఇవ్వాల్సి ఉంది. శిక్షణకు సంబంధించి ఏజెన్సీతో బాండ్‌పైన రాయించుకున్నాం. ప్రతి అంశం ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. ప్రతి తరగతి, ప్రతి పైసాకు లెక్క చెప్పాల్సిందే.

- శైలజ, దేవరాజ్, ఏపీసీలు, సమగ్రశిక్ష, అనంతపురం, శ్రీసత్యసాయి

ఆత్మరక్షణ కళలతో ఉపయోగం



ఆత్మరక్షణ కళలు బాలికలకు ఎంతో ఉపయోగకరం. మంచి లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకువచ్చింది. ఆత్మరక్షణ కళలు తమను తాము రక్షించుకోవడానికి ఉపకరిస్తాయి. ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు పూర్తి స్థాయిలో నైపుణ్యంగల కోచ్‌ల ద్వారా శిక్షణ ఇస్తే ఉపయోగం ఉంటుంది. ఈ పథకాన్ని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పకడ్బందీగా అమలు చేయాలి. క్రీడా శాఖ నుంచి మా వంతు సహకారం అందిస్తాం.

- ఉదయ్‌భాస్కర్, డీఎస్‌డీఓ



మొక్కతొడిగిన మోసం



నర్సరీలో పెంచుతున్న టమోటా మొక్కలు

నాసిరకం మొక్కలు అంటగడుతున్న నర్సరీ నిర్వాహకులు

- అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా నిర్వహణ
- కన్నెత్తి చూడని అధికార యంత్రాంగం
- సాగు సమయంలో గుర్తించలేక నష్టపోతున్న రైతులు

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఏడంతా ఏడిపించినా ఒక్కసారి పంట తగులుకుంటే చాలు తమ భాగ్యరేఖ మారుతుందని నమ్మి అనేక మంది రైతులు టమోటా పంటను సాగు చేస్తున్నారు. వీరు మొక్కల కోసం నర్సరీలపై ఆధారపడుతున్నారు. ఇదే అవకాశంగా కొందరు నర్సరీల నిర్వాహకులు నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. డిమాండ్‌ను బట్టి అధిక రేట్లు, నాసిరకం మొక్కలు అంటగడుతూ రైతులను దగా చేస్తున్నారనే విమర్శలు వినవస్తున్నాయి. నియోజకవర్గంలో ప్రస్తుతం సుమారు 200 పైబడి నర్సరీలు ఉన్నాయి. నర్సరీ నుంచి నాణ్యమైన ఉద్యాన మొక్కలను మాత్రమే రైతులకు అందించాలి. సిఫారసు చేసిన ఉద్యాన పంటల రకాల మొక్కలను మాత్రమే పెంచాలి. మొక్కపేరు, మూలాల వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలి. పురుగులు, తెగుళ్ల సోకని మొక్కలను రైతులకు సరఫరా చేయాలి. ఐదేళ్లలో జరిగిన మొక్కల అమ్మకాల వివరాలను యాజమాన్యం రికార్డు చేయాలి. మొక్కలను ఎక్కడి నుంచి తెచ్చారు, వాటి ధరలను బోర్డులపై ఉంచాలి. ప్రభుత్వం నుంచి తప్పకుండా లైసెన్సు పొంది ఉండాలి. ఇలాంటి నిబంధనలు ఇక్కడ ఏమాత్రం పాటించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కనిపించని ఉద్యానశాఖ అధికారులు

నాణ్యమైన మొక్కల పెంపకం కోసం రాష్ట్ర ప్రభుత్వం 2012లో ఉద్యాన పంటల నర్సరీల చట్టాన్ని రూపొందించింది. అనుమతులు లేకుండా నర్సరీలను నిర్వహించరాదని, అలా చేస్తే అధికారులు చర్యలు తీసుకునేలా జీవో నంబర్ 211ను ప్రభుత్వం విడుదల చేసింది. అయితే నియోజకవర్గంలో చాలా చోట్ల అనుమతులు లేకుండానే నర్సరీలను నిర్వహిస్తున్నారు. అయినా అధికారులు ఏమాత్రమ పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినవస్తున్నాయి. దీంతో నిర్వాహకులు నాసిరకం మొక్కలను రైతులకు అంటగడుతున్నారు. ఈ విషయమై రైతులు ఎన్నో సార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. నర్సరీల నుంచి మొక్క తెచ్చినపుడు అసలుకు, నాసిరకానికి ఏమాత్రం తేడా ఉండదు. పైరుగాని, మొక్కగాని ఎదిగే క్రమంలో రైతులు తేడాను గుర్తిస్తారు. అయితే అప్పటికే రైతు పెట్టుబడుల రూపంలో వేలాది రూపాయలు ఖర్చు చేసి ఉంటారు. దీంతో పంట పండక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఎవరైనా రైతులు గొడవకు దిగి తే రాజకీయ పార్టీల నాయకుల అండతో దుప్పటి పంచాయతీ చేస్తున్నారు. అంతో ఇంతో ముట్టజెప్పి సమస్యను సద్దుమణిగిస్తున్నారు.



కర్ణాటకకు పరుగులు

కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, కళ్యాణదుర్గం మండలాల పరిధిలో నాసిరకం టమోటా నారును రైతులకు అంటగడుతున్నారు. విసిగిపోయిన రైతులు నాణ్యమైన టమోటా మొక్కల కోసం కర్ణాటక ప్రాంతాలకు పరుగులు తీస్తున్నారు. చెళ్లికెర, పావగడ ప్రాంతాలకు వెళ్లి టమోటా, మిరప మొక్కలను ఎక్కువగా తీసుకొస్తున్నారు. అక్కడ మొక్కల్లో నాణ్యతా ప్రమాణాలు బాగుండటంతో చాలా మంది కర్ణాటక బాట పడుతున్నారు.



కుందుర్పి మండలంలో నర్సరీలకు తనిఖీకి వెళ్లి టమోటా మొక్కను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానశాఖాధికారి నరసింహారావు, ఉద్యానశాఖాధికారి గౌసియామీ (ఫైల్)

50 నర్సరీలకే అనుమతి

నియోజకవర్గంలో దాదాపు 50 నర్సరీలకు మాత్రమే అనుమతులు ఉన్నాయి. అయితే దాదాపు 200 నర్సరీలను నిర్వహిస్తున్నట్లు తెలిసింది. వీటిలో ఏ నర్సరీలోను నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదు. జిల్లా ఉద్యానశాఖాధికారులు కూడా నర్సరీల నిర్వాహణపై తనిఖీలు చేశారే కాని, పూర్తి స్థాయిలో నిబంధనలు అమలు జరిగేటట్లు చూడలేదు. టమోటా సాగు లాభసాటిగా ఉండటంతో రైతులు ఎక్కువ మంది పంట సాగుకు మొగ్గు చూపుతారు. దీన్ని ఆసరాగా చేసుకుని నర్సరీలు పుట్టగొడుగులా వెలిశాయి.

పంట ఎదుగుదల లేదు



నాకున్న మూడెకరాల్లో ఎకరాల్లో టమోటా సాగు చేశా. అయితే ఎన్ని మందులు పిచికారీ చేసినా పంట ఎదుగుదల లేదు. తోటి రైతులు పంటను పరిశీలించి నాసిరకంగా మొక్కలని తేల్చారు. ఈక్రమంలో పెట్టుబడులు కూడా రాక తీవ్రంగా నష్టపోయా. నర్సరీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి.

- బొమ్మయ్య, కరిగానిపల్లి, కుందుర్పి మండలం

ఐదెకరాల్లో నష్టపోయా



నాకున్న ఐదెకరాల పొలంలో విడతల వారీగా టమోటా సాగు చేశా. మొక్కలు కుందుర్పి మండలంలోని ఓ నర్సరీ నుంచి తెచ్చా. అవి నాసిరకం కావడంతో పంట ఏమాత్రం దిగుబడి రాలేదు. దీం తో పూర్తిగా నష్టపోయా. ఆర్థికంగా తీవ్రంగా ఇబ్బందులు పడ్డాం. - రామాంజనేయులు, కరిగానిపల్లి

నోటీసులు ఇస్తున్నాం

అనుమతులు లేని నర్సరీలకు నోటీసులు జారీ చేస్తున్నాం. కొన్ని నర్సరీలకు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. కొందరు రిజిస్ట్రేషన్ చేయించుకోలేదు. విచారించి చర్యలు తీసుకుంటాం. నకిలీ మొక్కలను ఇస్తున్నారని ఎవరైనా రైతులు ఫిర్యాదు చేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

- గౌసియామీ, ఉద్యానశాఖాధికారి

అవిశ్వాసానికి సై

మడకశిర చైర్‌పర్సన్‌పై 13మంది తీర్మానం

కలెక్టర్‌కు సమర్పణ



కలెక్టర్‌కు అవిశ్వాసం పెడుతున్నట్లు వినతి సమర్పిస్తున్న కౌన్సిలర్లు

మడకశిర టౌన్/పుట్టపర్తిటౌన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మడకశిర నగర పంచాయతీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి సర్వం సిద్ధమైంది. మొత్తం 20 మంది కౌన్సిలర్లు ఉండగా.. బుధవారం 13 మంది ప్రస్తుత చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మపై అవిశ్వాస తీర్మానానికి సై అన్నారు. ఆ మేరకు బుధవారం జిల్లా కలెక్టర్ చేతన్‌ను ఆయన చాంబర్‌లో కలిసి, కౌన్సిలర్లు తీర్మాన పత్రాలు సమర్పించారు. మడకశిర నగర పంచాయతీలో మొత్తం 20 వార్డులు ఉండగా.. ఐదుగురు టీడీపీ కౌన్సిలర్లు గెలుపొందారు. వైసీపీకి చెందిన 8 మంది కౌన్సిలర్లు.. అవిశ్వాసానికి మద్దతు ప్రకటించారు. వీరిలో పలువురు ఇప్పటికే టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు కూడా. దీంతో టీడీపీ బలం 13కి చేరింది. ఈ నేపథ్యంలో వారి సంతకాలతో కూడిన పత్రాలను కలెక్టర్‌కు అందజేశారు. వైసీపీ నుంచి టీడీపీ తీర్థం పుచ్చుకున్న ఐదో వార్డు కౌన్సిలర్ ప్రియాంక, 2వవార్డు సభ్యుడు సుధాకర్ నాయక్, 6వ వార్డు కౌన్సిలర్ పార్వతమ్మ, 13వ వార్డు సుజాతమ్మ, 14వ వార్డు వెంకటలక్ష్మమ్మ, 17వవార్డు సుభద్ర, 18వ వార్డు సావిత్రమ్మ తదితరులు అవిశ్వాసానికి మద్దతు ప్రకటించారు. ఈ మేరకు కలెక్టర్‌ను కలిసి తీర్మానాన్ని సమర్పించారు. దీంతో మడకశిర నగర పంచాయతీ పీఠంపై ఎవరు ఆసీనులవుతారన్న చర్చ సాగుతోంది. టీడీపీ తరఫున గెలుపొందిన వారికే అవకాశం ఇవ్వాలనుకుంటే 15వ వార్డు కౌన్సిలర్ నరసింహరాజు పీఠం ఎక్కడం ఖాయం. నగర పంచాయతీ ఎస్సీ జనరల్‌కు కేటాయించడంతో టీడీపీ తరఫున ఆ వర్గం నుంచి ఆయన మాత్రమే విజయం సాధించారు. దీంతో నరసింహరాజుకు పీఠం ఖరారు అన్న ప్రచారం సాగుతోంది. వైసీపీ నుంచి టీడీపీ తీర్థం పుచ్చుకున్న వారిలో ఇద్దరు ఆ వర్గానికి చెందిన వారు ఉండడంతో వారు పీఠంపై ఆశలు పెట్టుకున్నారని తెలుస్తోంది. కలెక్టర్‌ను కలిసిన వారిలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, కౌన్సిలర్లు నరసింహరాజు, ఉమాశంకర్, శ్రీనివాసులు, సుధాకర్ నాయక్, నాగేంద్ర, లక్ష్మయ్య ఉన్నారు.

మెడికల్ వెరిఫికేషన్ కోసం రూ.వెయ్యి చెల్లించాలి

అనంతపురం విద్య, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): టీచర్ల బదిలీల నేపథ్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లావ్యాప్తంగా మెడికల్ వెరిఫికేషన్‌కు వచ్చే టీచర్లు డీఎంహెచ్‌ఓ ఆదేశాల మేరకు ఆస్పత్రికి రూ.1000 చెల్లించాలని డీఈఓ ప్రసాద్‌బాబు బుధవారం ప్రకటనలో తెలిపారు. మెడికల్ వెరిఫికేషన్‌కు హాజరయ్యే టీచర్లు ఈవిషయాన్ని గమనించాలన్నారు. గురువారం అనంతపురం, 25న శ్రీసత్యసాయి జిల్లాల టీచర్లు, ఈ తేదీల్లో గైర్హాజరైన రెండు జిల్లాల టీచర్లు 26వ తేదీన హాజరుకావచ్చునని పేర్కొన్నారు.

మార్పులపై అవగాహన పెంచుకోవాలి: ఆర్టీసీ ఆర్ఎం

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): డ్రైవర్లు ఎప్పటికప్పుడు అధునాతన సాంకేతికతపై అవగాహన పెంచుకోవాలని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సుమంత్ పేర్కొన్నారు. ఆర్ఎం కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం బ్రేక్ సిస్టమ్ మెయింటెనెన్స్‌పై ఒక్క రోజు శిక్షణా కార్యక్రమంలో మాట్లాడారు. బ్రేకింగ్ సిస్టమ్‌లో ఆధునిక టెక్నాలజీ అయిన ఏబీఎస్(యాంటి లాక్ బ్రేక్ సిస్టమ్), ఈఎస్‌పీ(ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ ప్రోగ్రామ్)ల గురించి వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎంఈ రమేష్‌బాబు పాల్గొన్నారు.



కూడేరులో పాఠశాల వరండాలో అంగన్‌వాడీ కేంద్రం

ఏళ్లు గడిచినా..!

నిధులు లేక నిలిచిపోయిన అంగన్‌వాడీ భవనాలు

అద్దె భవనాల్లో కేంద్రాల నిర్వహణ

ఇబ్బంది పడుతున్న సిబ్బంది, లబ్ధిదారులు

కూడేరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో నాడు- నేడు పథకం కింద మంజూరైన అంగన్‌వాడీ కేంద్రాలు నిధులు లేక నిలిచి పోయాయి. దీంతో కొన్ని కేంద్రాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. మండల వ్యాప్తంగా 48 అంగన్‌వాడీ కేంద్రాల్లో 43 మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. మిగిలినవి అంగన్‌వాడీ కేంద్రాలు. ఆయా కేంద్రాల పరిధిలో అధికారుల లెక్కల ప్రకారం గర్భిణులు 254 మంది, బాలింతలు 241మంది, 6 నెలలోపు చిన్నారులు 242మంది, ప్రీ స్కూల్ 2472 మంది ఉన్నారు. గత కొన్నేళ్లుగా 13 అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. వైసీపీ పాలనలో నాడు- నేడు రెండో దశ కింద ఐదు అంగన్‌వాడీ కేంద్రాలు మంజూరు చేశారు. ఒక్కో భవన నిర్మాణానికి ప్రభుత్వం దాదాపు రూ.20 లక్షల నిధులు మంజూరు చేసింది. దీంతో ఇప్పేరు, పి. నాగిరెడ్డిపల్లి, మరుట్ల- 2 కాలనీ, ఉదిరిపికొండ, అరవకూరు గ్రామాలకు నూతన భవనాలను మంజూరు చేశారు.

నిధులు సక్రమంగా రాక

వైసీపీ పాలనలో మంజూరైన అంగన్‌వాడీ భవనాల నిర్మాణ పనులను అప్పట్లో ఇంజనీరింగ్ సిబ్బంది పట్టించుకోలేదు. పనుల సమయంలో అందుబాటులో ఉండకపోవడంతో ఆ భారం అంగన్‌వాడీలపైనే పడింది. దీంతో నిధులు సక్రమంగా రాక పోవడం, వచ్చిన అరకొర నిధులతో పనులు చేశారు. తిరిగి నిధులు విడుదల చేయకపోవడంతో భవన నిర్మాణం పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. తర్వాత భవన నిర్మాణ పనులను ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీలు, తల్లుల కమిటికి అప్పగించారు. ఎన్నికలు రావడంతో నిధులు విడుదల మరింత ఆలస్యమైయింది. దీంతో భవన నిర్మాణం కోసం నిల్వ చేసిన సిమెంట్ కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో గడ్డ కట్టి పనికి రాకుండాపోయింది. నిల్వ చేసిన ఇసుక సైతం వర్షాలకు కొట్టుకుపోయింది. ప్రస్తుత ప్రభుత్వం కూడా పనులను పట్టించుకోకపోవడంతో ఆయా పరిధిలో ఉన్న గ్రామీణులు నిర్వేదం వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాల వరండాలో ...

మండల కేంద్రంలోని మూడో అంగన్‌వాడీ కేంద్రం ప్రస్తుతం పాఠశాల వరండాల్లో కొనసాగుతోంది. సొంత భవనం దెబ్బతినడంతో అద్దె భవనాలు దొరక్క సెంటర్ నడపడానికి అంగన్‌వాడీ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల వరండాలో విధులు కొనసాగిస్తుండటంతో వానాకాలం లో వర్షాలకు వరండాలో ఇబ్బందులు తప్పవని ఆందోళన చెందుతున్నారు. సొంత భవనం నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయించారని, ప్రభుత్వం తక్షణం భవనం మంజూరు చేయాలని అంగన్‌వాడీ సిబ్బంది కోరుతున్నారు.



పి. నాగిరెడ్డిపల్లి గ్రామంలో నిలిచిపోయిన అంగన్‌వాడీ భవనం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం: శ్రీదేవి, సీడీపీఓ



మండలంలో నిలిచిపోయిన అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి అవసరమైన నిధుల కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఇప్పటి వరకు ఇప్పేరు, మరుట్ల, పి. నాగిరెడ్డిపల్లి, ఉదిరిపికొండ, అరవకూరు గ్రామాల్లో టాప్ లెవెల్ వరకు నిర్మాణ పనులు జరిగాయి. నిధులు రాక పోవడంతో పనులు నిలిచిపోయాయి. భవనాల పనులు పూర్తి కావడానికి అవసమైన నిధులు కోసం అధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

లారీ ఢీకొని ఫైర్ కానిస్టేబుల్ దుర్మరణం


సుధాకర్ (ఫైల్)

కనగానపల్లి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్తాపురం వద్ద 44వ జాతీయ రహదారిపై బుధవారం రోడ్డు దాటుతున్న ఫైర్ కానిస్టేబుల్ సుధాకర్ (44)ను లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మరణించాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనంతపురానికి చెందిన సుధాకర్ పుట్టపర్తిలో ఫైర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తుండేవారు. విధులు ముగించుకుని పుట్టపర్తి నుంచి అనంతపురం వెళ్లా ముక్తాపురం జంక్షన్‌కు చేరుకున్నారు. ఈ క్రమంలో రోడ్డు దాటుతున్న సుధాకర్‌ను బెంగళూరు నుంచి అనంతపురం వెళ్తున్న లారీ వేగంగా ఢీకొంది. ప్రమాదంలో సుధాకర్ అక్కడికక్కడే మృతిచెందారు. కనగానపల్లి పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సుధాకర్‌కు భార్య రమ్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

యువకుడి అదృశ్యం

గార్లదిన్నె, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): బ్రహ్మసముద్రం మండలం సుగేపల్లి కోనాపురం గ్రామానికి చెందిన యువకుడు దండు కరేగౌడ్ అదృశ్యమైనట్లు ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌బాషా తెలిపారు. పోలీసులు, బంధువులు తెలిపిన మేరకు దండు రామచంద్ర కుమారుడు కరేగౌడ్ వ్యవసాయంతో పాటు గ్రామంలో అంగడి వ్యాపారం చేసుకుంటు భార్యా పిల్లలు, తల్లిదండ్రులను పోషించుకునేవాడు. అయితే కరేగౌడ్‌కు కొద్ది రోజుల కిందట అనారోగ్యం బారిన పడ్డాడు. వైద్య పరీక్ష చేయించుకునేందుకు ఈనెల 20న అనంతపురంలో ఓ ప్రైవేట్ అస్పత్రికి తల్లి శివలింగమ్మతో కలిసి వచ్చాడు. వైద్య పరీక్షల అనంతరం గార్లదిన్నెలో ఉన్న చెల్లెలు రాజేశ్వరీకి ఇంటికి వెళ్లాడు. అదే రోజు సాయంత్రం బయటకు వెళ్లి వస్తానని ఇంట్లో చెల్లెలు రాజేశ్వరికి చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. కరే గౌడ్ కోసం చెల్లెలు రాజేశ్వరి, అమ్మ శివలింగమ్మ తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో బుధవారం గార్లదిన్నె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, గాలింపు చర్యలు చేపట్టారు.

అత్తింటి వేధింపులకు మహిళ బలి

అనంతపురం క్రైం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): అత్తింటి వేధింపులు తాళలేక నగరంలోని బోయగేరికి చెందిన మేదర జ్యోతి(25) ఆత్మహత్య చేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు... మేదర జ్యోతికి సూర్యానగర్‌కు చెందిన ఈశ్వర్‌బాబుతో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. జ్యోతిని అదనపు కట్నం కోసం కొన్నేళ్ల నుంచి భర్త, అత్త, మామ వేధిస్తున్నారు. అదనపు కట్నం తేకపోతే విడాకులిచ్చేస్తానని భర్త బెదిరించేవాడు. దీంతో కొంతకాలంగా జ్యోతి పుట్టింట్లో ఉంటోంది. ఈ క్రమంలో జీవితం మీద విరక్తి చెంది మంగళవారం రాత్రి ఇంటిపైనున్న గదిలోకి వెళ్లి ఉరి వేసుకుంది. ఆలస్యంగా గమనించిన కుటుంబ సభ్యులు కిందకు దించారు. అప్పటికే ఆమె ప్రాణాలు కోల్పోయింది. జ్యోతి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు జ్యోతి భర్త ఈశ్వర్‌బాబు, అత్త, మామ, బావ, తోడి కోడలుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రైవేట్ ఉద్యోగి ఆత్మహత్య

అనంతపురం రూరల్ మండల పరిధిలోని ఓవీఆర్ కాలనీకి చెందిన ప్రతాప్(34) అనే ప్రైవేటు ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఓ ఫైనాన్స్ కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్న ప్రతాప్.. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఒత్తిడి తాళలేక బుధవారం తెల్లవారుజామున తన ఇంట్లో ఉరివేసుకున్నాడు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కూలిన ఇంటి పైకప్పు

ఒకరి మృతి.. మరొకరికి గాయాలు


నారాయణమ్మ (ఫైల్)

గాండ్లపెంట, ఏప్రిల్23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కటారుపల్లిలో బుధవారం ఇంటి పైకప్పు కూలి ఓ వృద్ధురాలు మృతిచెందగా, మరో వృద్ధురాలు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన మేరకు మధ్యాహ్నం ఉక్కపోత తట్టుకోలేక ఇద్దరు వృద్ధులు ఓ ఇంటి ఆవరణ ముందు కూర్చొని కబుర్లు చెబుకుంటున్నారు. ఉన్నపలంగా ఇంటి ఆవరణ పైకప్పు కూలింది. ఈప్రమాదంలో నారాయణమ్మ (65) అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మరో వృద్ధురాలు వసుంధరమ్మ తలకు బలమైన గాయం కావడంతో 108లో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైనే చికిత్సకోసం అనంతపురం తరలించినట్లు చెప్పారు.

చర్చలు విఫలం..

సమ్మె కొనసాగిస్తాం.. ఓబులు..

అనంతపురం న్యూటౌన్ ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల సమస్యలపై బుధవారం నిర్వహించిన చర్చలు విఫలమయ్యాయి. దీంతో కార్మికుల సమ్మె కొనసాగుతుందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు పేర్కొన్నారు. శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు తమ డిమాండ్ల సాధనకు చేపట్టిన సమ్మె బుధవారం 18వ రోజుకు చేరింది. యూనియన్ నాయకులతో అధికారులు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కార్యాలయంలోని సమావేశ భవనంలో సమావేశమయ్యారు. కార్మికుల సమస్యలకు సంబంధించి స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో సమ్మె కొనసాగిస్తామని యూనియన్ నాయకులు తెలిపారు. చర్చల్లో భాగంగా వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న కార్మికులకు 5 నెలల నుంచి 10 నెలల వరకు వేతన బకాయిలు చెల్లించాలి. 30 నెలల నుంచి 40 నెలల వరకు పెండింగ్ ఉన్న పీఎఫ్ బకాయిలు చెల్లించాలన్న డిమాండ్‌తో ఈనెల 6 నుంచి నిరవధిక సమ్మెకు దిగారు. అధికారులు చర్చలు జరిపారు. కాంట్రాక్టర్ బకాయిలు చెల్లించడానికి మే 15 వరకు సమయం ఇవ్వాలని కోరారు. అందుకు యూనియన్ నాయకులు అంగీకరించలేదు. క లెక్టర్ చర్చలు జరిపి స్పష్టత ఇస్తేనే సమ్మె విరమిస్తామన్నారు. సమావేశంలో ఈఈ మురళీధర్‌రావు, డీఈ శిరీష, ఏఈ మద్దయ్య, శ్రీనివాసులు, యూనియన్ నాయకులు జిల్లా కార్యదర్శి నాగేంద్ర పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ. 21వేలు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 21వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 4వేలు, సరాసరి రూ. 14వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు.

సంక్షేమ హాస్టళ్లలో తగ్గిన ఉత్తీర్ణత

కొరవడిన పర్యవేక్షణ... పట్టించుకోని అధికారులు, వార్డెన్లు



అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో పదో తరగతిలో ఉత్తీర్ణత గతేడాదితో పోలిస్తే తగ్గిపోయింది. బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతిగృహాల్లో పదో తరగతి ఫలితాలు 64 శాతానికి పరిమితమయ్యాయి. 90 శాతం... 100కి 100 శాతం ఉత్తీర్ణత సాధిస్తామన్న సంక్షేమ వసతిగృహాల వార్డెన్లు, అధికారుల మాటలు ఒట్టి మాటలేనని నిరూపితమయ్యాయి. ఎటుచూసినా వసతిగృహాల్లో స్టడీ అవర్స్ తదితర అంశాల్లో పర్యవేక్షణ కొట్టొచ్చినట్లు ఫలితాలతో స్పష్టమవుతోంది. బీసీ సంక్షేమ శాఖలో గతేడాది 80.00 శాతం ఉత్తీర్ణత సాధిస్తే... ఈ ఏడాది 64.93 శాతానికి పరిమితమైంది. ఎస్సీ సంక్షేమ శాఖలో గతేడాది 89.44 శాతం ఉత్తీర్ణత సాధిస్తే... ఈసారి 61.68 శాతానికే పరిమితమైంది. గిరిజన సంక్షేమశాఖలో గతేడాది 80.16 శాతం ఉత్తీర్ణత వస్తే.. ఈ ఏడాది దారుణంగా 41.07 శాతానికి పరిమితవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బీసీ సంక్షేమశాఖ వసతిగృహాల్లో..

జిల్లాలో బీసీ సంక్షేమశాఖ పరిధిలోని వసతి గృహాల్లో మూడు డివిజన్లలో కలిపి 616 మంది విద్యార్థినీవిద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాశారు. వీరిలో 400 మంది పాసయ్యారు. 216 మంది ఫెయిలయ్యారు. వీరిలో 224 మంది ఫస్ట్‌క్లాస్‌లో ఉత్తీర్ణులయ్యారు. మొత్తంగా జిల్లాలోని బీసీ వసతిగృహాల్లో పదో తరగతి పరీక్షల్లో 64.93 శాతం ఉత్తీర్ణత నమోదైంది. అదే గతేడాది 80.00 శాతం ఉతీర్ణత సాధించారు. గతేడాదితో పోలీస్తే ఈసారి 15.07 శాతం తగ్గడం గమనార్హం. కళ్యాణదుర్గం బాలికల వసతిగృహంలో ముగ్గురు విద్యార్థినులు పరీక్షలు రాస్తే... అందరూ ఫెయిలయ్యారు. డి. హిరేహాళ్ బాలుర వసతిగృహంలో ఆరుగురు పరీక్షలు రాస్తే... అందరూ ఫెయిలయ్యారు.

ఎస్సీ సంక్షేమంలో..

ఎస్సీ సంక్షేమశాఖ వసతి గృహాలకు సంబంధించి గుత్తి డివిజన్ పరిధిలో 74 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా... 60 మంది పాసయ్యారు. 14 మంది ఫెయిలయ్యారు. 81.08 శాతం ఉత్తీర్ణత నమోదైంది. అనంతపురం డివిజన్ పరిధిలో 63 మంది పరీక్షలు రాయగా... 47 మంది పాసవగా... 16 మంది ఫెయిలయ్యారు. 74.60 శాతం ఉత్తీర్ణత నమోదైంది. తాడిపత్రి డివిజన్ పరిధిలోని ఎస్సీ వసతిగృహాల్లో 62 మంది విద్యార్థినీవిద్యార్థులు పరీక్షలు రాయగా... 42 మంది పాసవగా.. 20 మంది ఫెయిలయ్యారు. 67.74 శాతం ఉత్తీర్ణత నమోదైంది. కళ్యాణదుర్గం డివిజన్ పరిధిలో 118 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా... 57 మంది పాసయ్యారు. 61 మంది ఫెయిలయ్యారు. 48.31 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఉరవకొండ డివిజన్‌లో 61 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 29 మంది పాసవగా... 35 మంది ఫెయిలయ్యారు. అత్యల్పంగా 45.31 ఉత్తీర్ణత శాతం నమోదైంది. జిల్లావ్యాప్తంగా ఎస్సీ సంక్షేమ వసతి గృహాలకు సంబంధించి పదో తరగతి పరీక్షల్లో 61.68 శాతం ఉత్తీర్ణత సాధించారు. గతేడాది 89.44 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఈ లెక్కన ఉత్తీర్ణత 27.76 శాతం తగ్గడం గమనార్హం.

గిరిజన సంక్షేమంలో..

జిల్లాలో మూడు గిరిజన సంక్షేమ వసతిగృహాలున్నాయి. చియ్యేడులోని హాస్టల్‌కు చెందిన 9 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా... ముగ్గురు మాత్రమే పాసయ్యారు. మిగిలిన ఆరుగురు ఫెయిలయ్యారు. అనంతపురంలోని గిరిజన బాలుర వసతిగృహం విద్యార్థులు 10 మంది పరీక్షలు రాయగా... సగం మంది పాసయ్యారు. గుత్తిలోని ఇంటిగ్రేటెడ్ గిరిజన బాలికల వసతిగృహంలో 53 మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా... 22 మంది పాసవగా... 31 మంది ఫెయిలయ్యారు. జిల్లావ్యాప్తంగా గిరిజన వసతిగృహాలకు సంబంధించి 41.07 శాతం ఉత్తీర్ణత నమోదైంది. గతేడాది 80.16 శాతం ఉత్తీర్ణత సాధించడం గమనార్హం. మొత్తంగా గతేడాది వచ్చిన ఉత్తీర్ణత శాతంలో ఈ ఏడాది 39.0 శాతం తగ్గిపోయింది.

అత్యధిక మార్కులు సాధించిన వారు..

బీసీ సంక్షేమశాఖకు సంబంధించి నార్పల బీసీ బాలికల వసతిగృహంలోని ఎన్. గంగోత్రి అనే విద్యార్థిని 566, ఆత్మకూరు బీసీ బాలుర వసతిగృహంలోని వై. బాబా ఫకృద్దీన్ 559, డి. శబీర్ 554, జూటూరు బీసీ బాలుర వసతిగృహానికి చెందిన పి. మోక్షిత్‌రెడ్డి 556, అనంతపురంలోని బీసీ బాలికల హాస్టల్ విద్యార్థిని ఎస్. లక్ష్మి 552 మార్కులు సాధించారు. ఎస్సీ సంక్షేమశాఖకు సంబంధించి శెట్టూరు బాలుర వసతిగృహంలోని కె. భరత్ 562, టీకే జశ్వంత్ 553, యాడికిలోని ఎస్సీ బాలికల వసతిగృహ విద్యార్థిని బాగ్యలక్ష్మి 550, ఉరవకొండ ఎస్సీ బాలికల వసతిగృహానికి చెందిన తేజశ్విని 543, కళ్యాణదుర్గంలోని ఎస్సీ బాలికల నంబర్ వన్ హాస్టల్ విద్యార్థిని నవిత 532, యాడికిలోని బాలికల వసతిగృహం విద్యార్థిని లక్ష్మీప్రసన్న 532, గుంతకల్లులోని నం-1 బాలికల వసతిగృహానికి చెందిన సుచిత్ర 512 మార్కులు సాధించారు. గిరిజన సంక్షేమశాఖకు సంబంధించి గుత్తిలోని ఇంటిగ్రేటెడ్ బాలికల వసతిగృహంలో చార్మిప్రియ 562, యమున 500 మార్కులు సాధించారు.

సోషల్ మీడియాలో పోస్టు.. యువకుడిపై కేసు

చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రెచ్చగొట్టే రీతిలో సోషల్ మీడియాలో పోస్టు పెట్టిన ఓ యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సత్యనారాయణ బుధవారం తెలిపారు. చెన్నేకొత్తపల్లికి చెందిన బైరాపురం నాగరాజు ఇంటి వద్ద అడ్డుగా పక్కింటివారు గోడలు నిర్మించారు. కేసు కోర్టుకు వెళ్లడంతో తీర్పు నాగరాజుకు అనుకూలంగా వచ్చింది. కోర్టు ఉత్తర్వుల మేరకు పోలీసులు రెవెన్యూ, పంచాయతీ అధికారులు అక్కడికి వెళ్లి అడ్డుగా నిర్మించిన గోడలను తొలగించారు. ఈ నేపథ్యంలో గాలి సిద్ధార్థరెడ్డి అనే యువకుడు వైసీపీ సాను భూతిపరులకు చెందిన బాతురూం, ఇంటిపిల్లర్లను టీడీపీ బృందాలు కూల్చివేశాయంటూ సోషల్ మీడియా, వైసీపీ వాట్సాప్ గ్రూపుల్లో రెండు రోజుల కిందట రెచ్చగొట్టే రీతిలో పోస్టు చేశాడు. దీంతో బైరాపురం సరస్వతి అనే మహిళ ఆ పోస్టు తమ కుటుంబానికి ఇబ్బంది కరంగా ఉందని, టీడీపీ వారిని రెచ్చగొట్టేలా ఉందంటూ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే తన కుటుంబానికి ఏ పార్టీతో సంబంధంలేదని, అయితే సోషల్ మీడియాలో పెట్టిన పోస్టు టీడీపీ వారిని తమపైకి ఉసిగొల్పేలా ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు సిద్ధార్థరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మైనార్టీ టాప్.. జడ్పీ ఫ్లాప్

ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో భిన్నమైన ఫలితాలు

అనంతపురం విద్య, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మైనార్టీ వెల్ఫేర్ పాఠశాలలు 91.03 శాతం ఉత్తీర్ణతతో టాప్‌లో నిలిచాయి. జడ్పీ హైస్కూళ్లు 49.39 శాతం ఉత్తీర్ణతతో చివరలో నిలిచాయి. జడ్పీ హైస్కూల్ విద్యార్థులు 10,653 మంది పరీక్షలు రాశారు. వీరిలో 5,261 మంది మాత్రమే పాసయ్యారు.

37 పాఠశాలల్లో 100 శాతం

జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ స్కూళ్లలో 11,807 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 10,856 మంది పాసయ్యారు. వీరిలో బాలురు 6,162 మంది, బాలికలు 4,694 మంది ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 37 ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో 100 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.

యాజమాన్యాల వారీగా ఫలితాలు

పాఠశాల యాజమాన్యం	పరీక్ష రాసిన వారు	పాసైన వారు	శాతం
మైనార్టీ వెల్ఫేర్	234	213	91.03
బీసీ వెల్ఫేర్	365	314	86.03
సోషల్ వెల్ఫేర్	657	562	85.54
ఎయిడెడ్	406	309	76.11
మోడల్	1,261	923	73.20
కేజీబీవీలు	1,218	884	72.58
ట్రైబల్ వెల్ఫేర్	199	126	63.32
మున్సిపల్	2,083	1,145	54.97
గవర్నమెంట్	1,817	917	50.47
జిల్లా పరిషత్	10,653	5,261	49.39

ఆర్ఓఆర్ ఫైళ్లకు మోక్షం

ఆర్డీఓ కార్యాలయానికి బదలాయింపు

వైసీపీ హయాంలో డీఆర్వో పరిధిలోకి..

ఇబ్బందులు పడ్డ రైతులు... 600 ఫైళ్లు పెండింగ్

అనంతపురం క్రైం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా ప్రజలకు తలనొప్పిగా మారిన ఆర్ఓఆర్ (రికార్డ్ ఆఫ్ రైట్స్) ఫైళ్లు ఎట్టకేలకు ఆర్డీఓ కార్యాలయ పరిధిలోకి వచ్చాయి. వైసీపీ హయాంలో ఇందుకు సంబంధించిన ఫైళ్లనన్నింటినీ డీఆర్వో పరిధికి కేటాయించారు. ఎప్పటి నుంచో అమలవుతున్న ఈ విధానానికి బ్రేక్ వేసి 2023లో కొత్తగా డీఆర్వో కార్యాలయానికి అనుసంధానం చేశారు. అప్పటి నుంచి ఎన్నో సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. అప్పట్లో పనిచేసిన ఓ డీఆర్వో వాటి గురించే పట్టించుకోలేదని సమాచారం. ఎంతో మంది రైతులు, ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకోవడానికి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేయడానికే సరిపోయింది. ఆర్డీఓ కార్యాలయానికే వెళ్లలేని కొందరు డీఆర్వో కార్యాలయమంటే ఆ స్థాయి అధికారిని కలవడానికి వెనుకగుడుగేసేవారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన నెలలకే ఆర్ఓఆర్ ఫైళ్లు ఆర్డీఓ కార్యాలయానికి అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో ఈ విధానం అమలు కావడానికి కొంత ఆలస్యమైంది.

ఏయే సమస్యలుంటాయంటే...

రెవెన్యూ శాఖలో ఆర్ఓఆర్ అనేది హక్కుల రికార్డుగా పిలవబడే ఒక చట్టపరమైన పత్రం. ఒక భూమికి సంబంధించి యాజమాన్యం, పరిధి, భారాలు, సాగు, ఆస్తి పన్ను సహా సంబంధిత సమాచారం ఉంటుంది. పూర్వీకుల భూమా..? మరేదైనా భూమి యజమానా..? అనేది స్పష్టత ఇవ్వడానికి, తనిఖీ చేయడానికి ఆర్ఓఆర్ ఉపయోగపడుతుంది.

ఆర్డీఓ కోర్టు భూమి రికార్డులు, ఇతర రెవెన్యూ సంబంధిత కేసులను పరిష్కరించడానికి ఉపయోగిస్తారు. ఆర్డీఓ కోర్టులో వివాదాలుంటే విచారించి పరిష్కరించాల్సి ఉంటుంది. భూమి ఒకరి పేరు మీద ఉందనీ, ఒకరు, తాము సాగులో ఉంటే మరొకరి పేరు మీద భూమి ఉందని సంబంధిత వ్యక్తులు అధికారులను ఆశ్రయిస్తారు. మిగులు భూములను తమ పేరు మీద ఎక్కించుకోడానికి పరిష్కారం చేయాలని కోరుతారు. వివాదంలో ఉన్న అంశాలకు సంబంధించి ఎవరైనా భూమిని ఆక్రమించుకోవడం, మరొకరి పేరుతో ఆన్‌లైన్‌లో ఎక్కడం లాంటి సమస్యలతో ప్రజలు రెవెన్యూ కార్యాలయాలకు వెళ్తుంటారు. భూములకు సంబంధించి ఇలాంటి వివాదాలపై ఆర్డీఓ కార్యాలయానికి ఫైళ్లు వెళ్తుంటాయి.

600 ఫైళ్లు పెండింగ్...

ప్రభుత్వ నిర్ణయంతో ఎట్టకేలకు ఆర్ఓఆర్ ఫైళ్ల వ్యవహారం ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుంది. రెండురోజుల క్రితం అనంతపురం డివిజన్‌కు సంబంధించిన ఫైళ్లను డీఆర్వో కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయానికి తీసుకొచ్చారు. ఇప్పుడిప్పుడే సంబంధిత ఫైళ్లను పరిశీలిస్తున్నారట. డివిజన్ పరిధిలో మొత్తం 600 ఫైళ్ల వరకు పెండింగ్‌లో ఉన్నట్లు కార్యాలయ వర్గాలు చెప్పుకొస్తున్నాయి. డివిజన్ పరిధిలో 14 మండలాల నుంచి వచ్చిన ఫైళ్లు ఉండటం, రెండేళ్లుగా వాటిని పట్టించుకోకపోవడంతో పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. మరి అధికారులు ఎన్ని రోజుల్లో వాటిని పరిష్కరిస్తారో వేచిచూడాల్సిందే.

ఉగ్రదాడి పిరికిపంద చర్య

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జగదీష్


ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి పిరికిపంద చర్య అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జగదీష్ విమర్శించారు. సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. జగదీష్ మాట్లాడుతూ.. భారతదేశంలో మత సామరస్యాన్ని దెబ్బ కొట్టలనీ, హిందూ, ముస్లింల మధ్య చిచ్చు రేపాలని ఉగ్రవాదులు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడటం సహించరాదన్నారు. ప్రస్తుతం కశ్మీర్‌లో శాంతియుత వాతావరణం నెలకొందనీ, ప్రత్యేక రాష్ట్రం ప్రకటించడానికి అన్ని సమస్యలు పరిష్కారమై సమయంలో ఉగ్రవాదులు.. పర్యాటకులపై కాల్పులు జరిపి 30 మందిని పొట్టనపెట్టుకోవడం బాధాకరమన్నారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భారతదేశంలో పర్యటిస్తున్న సమయంలో ఇలాంటి దాడులు చేసి, కశ్మీర్‌ను అంతర్జాతీయ సమస్యగా చేయాలన్న కుట్రలో భాగమే ఉగ్రదాడిగా ఆయన అభివర్ణించారు. ఇలాంటి ఘటనలను ప్రపంచం మొత్తం ముక్తకంఠంతో ఖండించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి మహేష్, పట్టణ కార్యదర్శి గోపి, సహాయకార్యదర్శి ఎస్ మహమ్మద్ గౌస్, మండల కార్యదర్శి రాము పాల్గొన్నారు.

జనసేన నివాళి

పహల్గాంలో ఉగ్రదాడి మృతులకు జనసేన పార్టీ స్థానిక కార్యాలయంలో నివాళులర్పించారు. జనసేన పతాకాన్ని అవనతం చేశారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వాసిగిరి మణికంఠ మాట్లాడుతూ.. ఉగ్రవాదుల దాడి దుశ్చర్య అని మండిపడ్డారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు బండి శేఖర్ పాల్గొన్నారు.

ఉగ్ర దాడిని ఖండించిన రఘువీరా

మడకశిర, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జమ్మూ, కశ్మీర్ ప్రాంతంలోని పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రవాద దాడిని మాజీమంత్రి రఘువీరారెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఎక్స్‌లో ఓ పోస్టు చేశారు. సరిహద్దులో ఇటువంటి ఉగ్రవాద చర్యలు అమానుషమైనవి, ఆమోదయోగ్యం కాదన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇటువంటి దాడులను నివారించడానికి కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు సత్యసాయి ఆరాధనోత్సవాలు

పుట్టపర్తి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి ఆరాధనోత్సవాలు గురువారం ప్రశాంతి నిలయంలో నిర్వహించనున్నారు. ఇందుకోసం సాయికుల్వంతులో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు వస్త్రదానం, నారాయణసేవను అందించడానికి హిల్‌వ్యూ స్టేడియంలో షామియానా లు ఏర్పాటు చేశారు. దాదాపు 30వేల మంది భక్తులు సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం సాయికుల్వంతులో సత్యసాయి విద్యార్థుల వేదపఠనంతో ఆరాధనోత్సవాలు ప్రారంభమవుతాయి. సత్యసాయి సేవల గురించి సేవా సంస్థల జాతీయ అధ్యక్షుడు నిమీష్‌పాండే ప్రసంగిస్తారు. ఆరాధనోత్సవాలలో పాల్గొనడానికి వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు ఇప్పటికే ప్రశాంతి నిలయం చేరుకున్నారు. వేడుకల్లో పాల్గొనే భక్తులకోసం అవసరమైన ఏర్పాట్లలో సేవాదళ్ సభ్యులు నిమగ్నమయ్యారు.

సమావేశంలో కౌన్సిలర్ల వాగ్వాదం

గుంతకల్లు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ సాధారణ సమావేశంలో టీడీపీ, వైసీపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ భవనంలో బుధవారం చైర్‌పర్సన్ ఎన్ భవాని అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఇందులో ప్రభుత్వం వార్డుల్లో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టడం లేదని వైసీపీ కౌన్సిలర్లు ఆరోపించారు. కమిషనరు నయీం అహ్మద్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం కూడా పూర్తి కాలేదంటూ వివరణ ఇవ్వబోగా, అధికారివై ఉండి తగిన సమాధానం చెప్పకుండా ప్రభుత్వంవైపు మాట్లాడుతావా..? అంటూ వారు ఆగ్రహాన్ని వ్యక్తంచేశారు. దీంతో టీడీపీ కౌన్సిలర్లు పవన్ గౌడు, కృపాకర్, యూ ప్రభాకర్, వై సుధాకర్, అనూరాధ, విద్యారాణి కలగజేసుకుని వైసీపీ హయాంలో ఏమాత్రం అభివృద్ధి చేశారో ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని అన్నారు. పట్టణాభివృద్ధిపై చైర్‌పర్సన్‌ను నిలదీయండి అంటూ ఘాటుగా జవాబిచ్చారు.

మొక్కజొన్న పంట దగ్ధం


పంటను చూపుతున్న రైతు

బెళుగుప్ప, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని దుద్దేకుంటలో బుధవారం ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ పేలి రైతు చంద్రకు చెందిన మూడు ఎకరాల్లోని మొక్కజొన్న పంట దగ్ధమైంది. పంట దిగుబడి ఆశాజనకంగా ఉందని, మరో రెండు రోజుల్లో కోత మొదలుపెట్టేవారమని, అంతలోనే ట్రాన్స్‌ఫార్మర్ పేలి మంటలు వ్యాపించి పంట దగ్ధమైందని, దీంతో పాటు డ్రిప్ పరికరాలు కూడ కాలిపోయాయని బాధిత రైతు వాపోయారు. రూ. రెండు లక్షల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

కర్ణాటక మద్యం పట్టివేత

రాయదుర్గం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): గుమ్మఘట్ట మండలం శిరిగేదొడ్డిలో కర్ణాకట మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం అందడంతో బుధవారం దాడులు నిర్వహించామని, అక్కడ జయపాల్ అనే వ్యక్తిని అరెస్టు చేసి అతడి వద్ద నుంచి కర్ణాటకకు చెందిన 22 టెట్రాప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సీఐ మహేష్‌కుమార్ తెలిపారు. తర్వాత అరస్టయిన వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. దాడులలో ఎస్ఐలు పవన్, దామోదార్ పాల్గొన్నారు.

పేలుడుతో మహిళా కూలీకి తీవ్రగాయాలు

పెద్దవడుగూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పేచర్ల గ్రామ సమీపంలో గల ఒక పొలంలో పేలుడు పదార్థం పేలడంతో కూలిపనులు చేస్తున్న సాలమ్మ అనే మహిళకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. రైతు వేరుశనగ పంటను అడవిపందులు బారి నుంచి కాపాడుకొనేందుకు గాను తన పొలంలో డిటోనేటర్లు ఏర్పాటు చేశాడు. అయితే మహిళా కూలీ ఆ పొలంలో పని చేస్తూ దానిని రాయితో కొట్టింది. దీంతో అది పేలడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. స్థానికులు చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

10మంది బైండోవర్

తాడిపత్రి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోడాయిపల్లి, గన్నెవారిపల్లికాలనీల్లో రౌడీషీటర్లకు బుధవారం రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలు సృష్టించకుండా మంచి మార్గాన నడవాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ రజాక్‌వలి ఎదుట వారిని హాజరు పరిచి బైండోవర్ చేశారు.

‘డిపాజిట్లు చెల్లించేందుకు చర్యలు’

ఉరవకొండ, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఉరవకొండ టౌన్ బ్యాంకులో డిపాజిట్‌దారులకు డిపాజిట్ చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా సహకర అధికారి అరుణ కుమారి పేర్కొన్నారు. టౌన్‌బ్యాంకులో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. టౌన్‌బ్యాంకులో రూ.5.92కోట్లు చెల్లించాల్సి ఉండగా.. రూ.4.20కోట్లను డీఐసీజీసీ వారు 1120మందికి చెల్లించేందుకు అనుమతులిచ్చారన్నారు. ఎఫ్‌డీ బాండ్ ఒరిజనల్, డిపాజిట్ బుక్, ఆధార్, పాన్‌కార్డులు వేరే బ్యాంకులో అకౌంట్ ఉంటే ఖాతా నెంబర్‌తో పాటు ఐఎఫ్‌సీ కోడ్ వివరాలు అందజేయాలన్నారు. సమావేశంలో సీఈవో వేదమూర్తి పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పెద్దవడుగూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావులుడికి గ్రామానికి చెందిన తిరుపాల్ అనే వ్యక్తి విషద్రావకం తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గ్రామంలోని ఇంటిలో బుధవారం ఎవరూ లేని సమయంలో ఆయన ఈ అఘాత్యానికి పాల్పడ్డాడు. కొద్దిసేపటికి కుటుంబ సభ్యులు గమనించి వెంటనే గుత్తి ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

తాడిపత్రి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పెద్దవడుగూరు మండలం చిన్నవడుగూరు గ్రామానికి చెందిన రామలక్ష్మికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద 3,25,899 రూపాయలు మంజూరయ్యాయి. అందుకు సంబంధించిన చెక్కును పట్టణంలోని తన నివాసంలో ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి లబ్ధిదారురాలి కుటుంబసభ్యులకు బుధవారం అందజేశారు. మండల టీడీపీ నాయకులు దివాకర్‌రెడ్డి, కౌన్సిలర్ విజ్జి, ఖాదర్ ఉన్నారు.

రక్తదాన శిబిరం

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కనదొడ్డి గ్రామ సమీపంలోని ఐఓసీ డిపోలో బుధవారం రెడ్‌క్రాస్ సొసైటీ వారు రక్తదాన శిబిరం నిర్వహించారు. ఐఓసీ అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు, అయిల్ ట్యాంకర్ డ్రైవర్లు, క్లీనర్లు సుమారు 50 మంది దాకా పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలోఐఓసీఎల్ న్యూడిపో సీనియర్ మేనేజర్ హరీష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఘనంగా దత్తాత్రేయ ఆరాధనోత్సవాలు

● పాల్గొన్న ఎంపీ అంబికా

నార్పల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీ పప్పూరులో వెలసిన సద్గురు దత్తాత్రేయ స్వామి ఆరాధన మహోత్సవంలో ఎంపీ అంబికాలక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన బుధవారం గ్రామానికి వెళ్లి స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు భోజనం వడ్డించారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ ఈశ్వర్, రైల్వే కమిటీ మెంబర్ శివప్రసాద్, ప్రభుత్వ హాస్పిటల్ కమిటీ మెంబర్ నరసింహులు, గురువులు నారాయణస్వామి, ఈశ్వరయ్య, సత్యనారాయణ, సుధాకర్, తిరుపతయ్య, సంజీవ రెడ్డి, నరసన్న, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడులతో దేశ సమైక్యతను దెబ్బతీయలేరు

● ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఉగ్రదాడులతో దేశ సమైక్యతను దెబ్బతీయలేరని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌లోని బైసారన్ ప్రాంతంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేసి 28 మందిని హతమార్చడం దుర్మార్గమన్నారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిని ఎన్డీఏ ప్రభుత్వం ఉపేక్షించదన్నారు. ఈ ఘటనలో అమాయకమైన ప్రజలు చనిపోవడం చాలా బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

ఉగ్రదాడి దుర్మార్గ చర్య

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 24(ఆంధ్రప్రదేశ్): పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి దుర్మార్గపు చర్యను ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఐలు) ఖండిస్తోందని ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు సూర్యచంద్ర యాదవ్ బుధవారం ప్రకటనలో తెలిపారు. నిరాయుధ పౌరులపై హింసాత్మక చర్య మానవాళికి అవమానమని వాపోయారు. గాయపడినవారు త్వరతగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు.

పిరికిపంద చర్య: సీపీఎం



మృతులకు నివాళులర్పిస్తున్న సీపీఎం, ప్రజాసంఘాల నాయకులు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి అమానవీయ ఘటన అని, ఇది పిరికిపంద చర్య అని సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి పేర్కొన్నారు. కశ్మీర్‌లో ఉగ్రదాడిని నిరసిస్తూ, మృతులకు సంతాపంగా సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని క్లాక్‌టవర్ కూడలి వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పించారు. సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు ముత్తుజా, ప్రకాష్, వలి, గోపాల్, ఇర్ఫాన్, మసూద్, నగర కమిటీ సభ్యులు జీవ, రాజు, లక్ష్మీనారాయణ, బాలకృష్ణ, నూరుల్లా, జాకీర్, నజీర్, శంషాద్, శంకర్, హాజీ వలి తదితరులు పాల్గొన్నారు.

రగ్బీ జాతీయ పోటీల్లో ఎస్కేయూ విద్యార్థులు

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో నిర్వహిస్తున్న రగ్బీ పోటీల్లో ఎస్కేయూ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. బీటెక్ తృతీయ సంవత్స రం విద్యార్థులు శ్రీకాంత్ పురుషుల విభాగానికి, అక్షిప షాను మహిళా విభాగానికి ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర తెలిపారు. ఈ నెల 23 నుంచి 28 వరకు అస్సాం రాష్ట్రంలోని గౌహతి పట్టణంలో సీనియర్ నేషనల్ రగ్బీ చాంపియన్‌షిప్-2025 పోటీలు జరుగుతున్నాయన్నారు. రాష్ట్రం నుంచి శ్రీకాంత్, అక్షిప షాను పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. బుధవారం జరిగిన పోటీల్లో అక్షిప షాను ప్రతిభ కనబరచినట్లు పేర్కొన్నారు.

పీవీకేకే ఐటీలో ఆంగ్లభాషా దినోత్సవం

అనంతపురం రూరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని పీవీకేకే ఐటీ కళాశాలలో హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగం, విద్యార్థుల కార్యాచరణ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఇంగ్లీష్ భాష దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అబ్రాడ్ ఫోకస్ ఓవర్సీస్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ అపర్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, హ్యూమానిటీస్ విభాగాధిపతులు కిరణ్ కుమార్‌రావు, నరసప్ప, ఇంగ్లీష్ ఫ్యాకల్టీ సభ్యులు నరేష్, ఆనంద్, ముజీబ్, పవని, ఆస్రాక్, వాహీదా, పర్వీన్ పాల్గొన్నారు.

'అనంతలక్ష్మి'లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



విద్యార్థులతో చైర్మన్ అనంతరాముడు

అనంతపురం విద్య/సెంట్రల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఇటుకలపల్లి సమీపంలోని అనంతలక్ష్మి ఇంటర్నేషనల్ స్కూల్‌లో బుధవారం ప్రీప్రైమరీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే ఘనంగా చేశారు. స్కూల్ చైర్మన్ అనంతరాముడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందించారు. స్కూల్ సీఏఓ నరసింహరావు, స్కూల్ ప్రధానోపాధ్యాయలు షాలిని, టీచర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు వృత్తి విద్య సర్టిఫికెట్ల పంపిణీ

గార్లదిన్నె, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): వృత్తి విద్య కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ఆదర్శ పాఠశాలలో సర్టిఫికెట్లను ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్ అందజేశారు. 9, 10, ఇంటర్ చదివే విద్యార్థులను మెరుగు పరిచేందుకు వృత్తి విద్య ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. అనంతరం దసర, మార్చి సెలవుల్లో 10 రోజులు ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కంప్యూటర్స్, ఐటీ ఒకేషనల్ ట్రైయినర్స్ మాస్టర్ నిరంజన్‌రెడ్డి, నరసింహ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ టీడీపీ కార్యకర్త మృతి

రాప్తాడు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బోగినేపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త కంసల సురేంద్ర (37) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడని కుటుంబ సభ్యులు, అనంతపురం రూరల్ పోలీసులు తెలిపారు. బోగినేపల్లికి చెందిన కంసల సురేంద్ర అనంతపురం నగరం సమీపంలోని ఓ ప్రైవేటు పాఠశాల బస్సు డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగించేవాడు. ఈనెల 19న అనంతపురం రూరల్ మండల ఆలమూరు సమీపంలో అదుపుతప్పి ప్రైవేటు పాఠశాల బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సురేం ద్ర, క్లీనర్ నాగరాజు నాయక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వారిని అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సురేంద్ర పరిస్థితి విషమంగా బెంగుళూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. తిరిగి అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె కలరు. పెద్ద దిక్కు మరణించడంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

'పది'లో సత్తాచాటిన ప్రభుత్వ విద్యార్థులు



హాసిని పూజిత ధరణి అమృత హేమలత పి.వంశీ బి.భావన

అనంతపురం రూరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పది పరీక్షల్లో మండలంలో 68.08శాతం ఉత్తీర్ణత నమోదైంది. తొమ్మిది జిల్లా పరిషత్ పాఠశాలలు, అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ పాఠశాల, కేజీబీవీ, ఏపీఎస్‌డబ్ల్యూ ఆర్ఎస్ ఉన్నాయి. ఈ పాఠశాలల్లో బాలురు 221మంది, బాలికలు 284 మొత్తం 505 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో 495మంది పది పరీక్షలు రాశారు. 337మంది ఉత్తీర్ణత సాధించగా.. 158 మంది ఫెయిల్ అయినట్లు ఎంఈఓ వెంకటస్వామి తెలిపారు. కాగా కురుగుంట అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ పాఠశాల విద్యార్థిని హాసిని 574 మార్కులు సాధించింది. అదే పాఠశాలకు చెందిన పూజిత 570, పాపంపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని ధరణి 570 మార్కులు సాధించారు. కురుగుంట ఏపీ ఎస్‌డబ్ల్యూ ఆర్ఎస్ విద్యార్థి అమృత 568, ఆర్ హేమలత 568, పాపంపేట జడ్పీ పాఠశాల విద్యార్థులు అదిలా ఖనం 567, వి. మంజుల 562, తపోవనం జడ్పీ పాఠశాల విద్యార్థి జి.ప్రేమ్‌సాగర్ 559, రుద్రంపేట జడ్పీ పాఠశాల ఆర్. గీత 558 మార్కులు సాధించారు. కందుకూరు జడ్పీ పాఠశాల విద్యార్థిని బి. భావన 554, రుద్రంపేట జడ్పీ పాఠశాల విద్యార్థిని ఇ. చేతన్ 553, సిండికేట్ నగర్ జడ్పీ పాఠశాల విద్యార్థి పి వంశీ 551, తపోవనం జడ్పీ పాఠశాల విద్యార్థిని ఇ. రక్షిత 550 మార్కులు సాధించారు. పాఠశాలల్లో ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ పాఠశాల 98.82శాతం, కేజీబీవీ 73.68, తపోవనం జడ్పీ పాఠశాల 72.06 శాతం నమోదుతో తొలిమూడు స్థానాల్లో నిలిచాయి. 44.83శాతం ఉత్తీర్ణతతో తాటిచెర్ల జడ్పీ పాఠశాల మండలంలో చివరి స్థానంలో నిలిచింది.



కావ్య సాయి అఖిలారెడ్డి బాల చైతన్య లిఖిత

● గార్లదిన్నె: పది పరీక్షా ఫలితాల్లో మండలంలోని కేజీబీవీ, ఆదర్శ పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కేజీబీవీ విద్యార్థిని ఎం. కావ్య 578 మార్కులు సాధించింది. ఆదర్శ పాఠశాల విద్యార్థులు సాయి అఖిలారెడ్డి 577, బాలచైతన్య 575, లిఖిత 564 మార్కులు సాధించారు. మండల వ్యాప్తంగా 11 పాఠశాలలో చదువుతున్న విద్యార్థు లు 482 మంది పది పరీక్షలు రాయగా 259 మంది ఉత్తీర్ణత పొందారు.



వాసవి ప్రణయ సాయి సుప్రీత హాజీరా

శింగనమల, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పది ఫలితాల్లో మండలంలో 68 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. స్థానిక గురుకుల పాఠశాలలో చదివిన వాసవి 558 మార్కులు సాధించింది. మండలంలో వ్యాప్తంగా 561 మంది విద్యార్థులు పరీక్ష రాయగా.. 382 మంది ఉత్తీర్ణుల య్యారు 179 మంది ఫెయిల్ అయ్యారు. మండలవ్యాప్తంగా 68 శాతం ఉత్తార్ణత సాధించారని ఎంఈఓ నరసింహరాజు తెలిపారు.



ఉషశ్రీ ఐశ్వర్య ధరణి సౌమ్య జీవన అంకిత అంజలి ప్రియ దేవిశ్రీ భవాని

● రాప్తాడు: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు సత్తా చాటారు. రాప్తాడు, హం పాపురం, బండమీదపల్లి, గాండ్లపర్తి, మరూరు, గొందిరెడ్డిపల్లి, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల్లో మొత్తం 346 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 216 మంది ఉత్తీర్ణులయ్యారు. ఆదర్శ పాఠశాలలో ఉషశ్రీ 576, ఐశ్వర్య 572, ధరణి 571 మార్కులు సాధించారు. కేజీబీవీలో సౌమ్య 548, జీవన 537, అంకిత 525 మార్కులు సాధించారు. రాప్తాడు ఉన్నత పాఠశాలలో అంజలి ప్రియ 546, దేవిశ్రీ భవాని 542 మార్కులు సాధించారు. ఇదిలా ఉండగా మండలంలో ప్రభుత్వ పాఠశాలల ఉత్తీర్ణత తగ్గింది. మండల వ్యాప్తంగా ఎనిమిది ఉన్నత పాఠశాలల్లో కలిసి 62 శాతం విద్యార్థులు మాత్రమే ఉత్తీర్ణులయ్యారు.

'పది'లో ప్రైవేట్ స్కూళ్లు అదుర్స్



కె. నాగజాహ్నవి జ్యోత్స్నశ్రీ గీతిక పవన్‌రెడ్డి

అనంతపురం విద్య, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థులు టెన్త్ ఫలితాల్లో మార్కుల దుమారం లేపారు. బుధవారం విడుదలైన పది ఫలితాల్లో కొందరు 594 మార్కులు సాధించి, మరి కొందరు 593 మార్కులు సాధించి స్కూళ్లలో టాపర్లుగా నిలిచారు. ఇక 570, 560, 550 మార్కులు సాధించిన వారు భారీగా ఉన్నారు. ఆ విద్యా ర్థులను వాళ్ల తల్లిదండ్రులు, కరస్పాండెంట్లు, ప్రిన్సిపాళ్లు అభినందించారు.

మాంటిస్సోరి స్కూల్‌లో... గుత్తి, సంగమేష్ నగర్‌లోని మాంటిస్సోరి విద్యా ర్థులు పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించారని కరస్పాం డెంట్ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. గానశ్రీ 585 మార్కులు, తన్విష్ చరణ్, హృదయ్‌వికాస్ తేజ 582, నీలాచలం 580, శ్రీవిజ్ఞ, తరుణ్ రాజ్ 577, చరిత, అప్రానిమ్ర 576, భవిత 575, పూజిత 574, వర్షిత, శివ లాస్య 573, భావన, రుషిత, తేజవిశృత్ 570 మార్కులు సాధించారు. 550 మార్కులపైన 34 మంది, 500 మార్కులపైన 81 మంది సాధించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి మాధవి, ప్రిన్సిపాళ్లు రమాదేవి, పద్మావతి,టీచర్లు పాల్గొన్నారు.

మినర్వా స్కూల్‌లో... అశోక్ నగర్‌లోని మినర్వా స్కూల్ విద్యార్థి రెనీలా ప్రియ 596 మార్కులు సాధించినట్లు కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. అదేవిధంగా విద్యార్థులు పరిణిత 579 మార్కులు, షేక్ మహమ్మద్ గౌస్ 577, తేజస్విని, హుస్సేన్ 571, చరిత 563, వర్షిత్ 561, బిందు 555, శాన్వీ 553, ధరణి 550 మార్కులు సాధించారన్నారు. ఉత్తమ మార్కులు సాధించిన వారిని అభినందించారు.

శ్రీచైతన్య స్కూల్‌లో... టెన్త్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థులు ఆరుగురు 596 మార్కులు సాధించారని ఏజీఎం సుబ్బారెడ్డి పేర్కొన్నారు. రాంనగర్‌లోని కమ్మభవన్‌లో ఆయన విద్యార్థులను అభినందించారు. 596 మార్కులను ఆరుగురు, 595 మార్కులను నలుగురు, 590 మార్కులు 56 మంది సాధించారన్నారు. విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు విశ్వనాథ్, సమీనాఖాన్, తబస్సుమ్, వెంకటేష్, నరేష్, పర్వీన్‌బాను, నేత్రావతి, శాంత,శ్రీదేవి, రాధిక, కరీం పాల్గొన్నారు.

నారాయణ విద్యార్థులు... ద్వారకా నగర్‌లోని నారాయణ స్కూల్‌లో చదివే వినమ్ర 596 మార్కులు సాధించినట్లు ఏజీఎం రమేష్ బాబు పేర్కొన్నారు. విద్యార్థులను ఆయన అభినందించారు. విద్యార్థులు పావని 595, కాషిపా 593, హన్సిక 592, అపూర్వగౌడ్, జ్ఞాన్‌ప్రియ, కాలవ నాగజాహ్నవి 591 మార్కులు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ ప్రేమ్‌కుమార్‌రెడ్డి, ఏఓ రవీంద్ర, ప్రిన్సిపాల్ అష్మాబేగం, విద్యార్థులు, ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

లక్ష్మీ సినర్జీ స్కూల్... నగరంలోని లక్ష్మీ సినర్జీ స్కూల్ విద్యార్థులు అత్యధికంగా 594 మార్కులు సాధించారని కరస్పాండెంట్ మధుసూదన్ రెడ్డి తెలిపారు. జ్యోత్స్నశ్రీ, గీతిక, రుత్విక్ పవన్‌రెడ్డి 594 మార్కులు, హఫ్సానాఫిర్దౌజి, మహమ్మద్ రెహాన్, లలిత్ కుమార్‌రెడ్డి 593, దివిజేష్‌రెడ్డి 592 మార్కులు సాధించారన్నారు. 590 మార్కులపైన ఏడుగురు, 580 మార్కులపైన 39 మంది, 570 మార్కులపైన 67 మంది, 560 మార్కులపైన 97 మంది, 550 మార్కులపైన 117 మంది మార్కులు సాధించారన్నారు.

ఎస్ఆర్‌కే స్కూల్‌లో... వికాస్ నగర్‌లోని ఎస్ఆర్‌కే స్కూల్ విద్యార్థులు మంచి మార్కులు సాధించినట్లు స్కూల్ కరస్పాండెంట్ సునీతరెడ్డి తెలిపారు. విద్యార్థులు రజని 581 మార్కులు, మోహన్ 579 మార్కులు, ప్రియాంకరెడ్డి 572 మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు.

సాయి విజ్ఞాన్ స్కూల్‌లో... నగరంలోని మూడో రోడ్డులో ఉన్న సాయి విజ్ఞాన్ స్కూల్‌లో పలువురు ఉత్తమ మార్కులు పొందినట్లు డైరెక్టర్లు శ్రీనివాసులు, కరుణాకర్ తెలిపారు. రోహిత్ 575 మార్కులు, వరుణ్ సందేశ్ 574, మహమ్మద్ 571, శ్రవంతి 552, జశ్వంత్ 549, మణి చరణ్ 538, రమేష్ 535, పవన్‌కుమార్ 531, మహిందర్ 528 సాధించారని తెలిపారు. ప్రిన్సిపాల్ లావణ్యరామ్, టీచర్లు పాల్గొన్నారు.

ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్‌లో... టెన్త్ ఫలితాల్లో ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్ విద్యార్థులు మంచి మార్కులు సాధించారని విద్యాసంస్థల అనంతపురం జోన్ ఇన్‌చార్జి శివకుమార్, ఏజీఎం వెంకట్ తెలిపారు. టెన్త్‌లో 550 మార్కులపైన తొమ్మిది మందికి, 500 పైన 39 మందికి వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో డీన్ రాధాకృష్ణ, ఏజీఎం వెంకటేశ్వర్లు, జగన్‌మోహన్‌రెడ్డి, కల్పన ప్రిన్సిపాళ్లు రాజేష్, జగదీష్‌బాబు, భవాని, టీచర్లు పాల్గొన్నారు.

భాష్యం స్కూల్‌లో... జీసస్ నగర్‌లోని భాష్యం స్కూల్‌లో సఫియా సుల్తానా 587 మార్కులు, శ్రీనిధి, వరుణ్ 584, అయాన్ 583, హిమ వర్షిణి 582 మార్కులు సాధించారని అనంతపురం జోన్ /డీఈఓ రవివర్మ, ప్రిన్సిపాల్ బాలకృష్ణ తెలిపారు. అదేవిధంగా 550మార్కుల పైన 23 మంది సాధించారన్నారు.

నవభారత్ స్కూల్‌లో....

● అనంతపురం కల్చరల్: పదోతరగతి పబ్లిక్ పరీక్షలలో ఆజాద్‌నగర్‌లోని నవభారత్ పాఠశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. మొత్తం 72 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 34 మంది 500కు పైగా మార్కులు సాధించారని, వందశాతం ఉత్తీర్ణులయ్యారు. ప్రధానంగా నంద కిశోర్ 582, అరవింద్ యాదవ్ 576, సాత్విక 576, హేమలత 573, శ్రేయ కిశోర్ 570 మార్కులతో విజయం సాధించారు. ఈ నేపథ్యంలో బుధవారం పాఠశాల కరస్పాండెంట్ నిట్టూరు శశిభూషణ్, గురుప్రసాద్, హెచ్ఎంలు కృష్ణవేణి, అనితలు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

సత్తాచాటిన కేశవరెడ్డి విద్యాసంస్థలు

● బుక్కరాయసముద్రం: అనంతపురం మారుతీనగర్ కేశవరెడ్డి పాఠశాల విద్యార్థులు పదోవతరగతి ఫలితాల్లో సత్తాచాటారు. పాఠశాలల్లో వంద ఉత్తీర్ణత వచ్చిందని ఆ పాఠశాల డీన్ యెరికల రెడ్డి తెలిపారు. పాఠశాలలో జైబాతబుస్సుమ్ 594, చైత్ర593 మార్కులు సాధించడంతో పాటు 100 శాతం 500 మార్కులుపైగా సాధించారన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ నీలిమా, వైస్ ప్రిన్సిపాల్ ప్రమీలా అభినందనలు తెలిపారు.



శ్రీచైతన్య స్కూల్‌లో విద్యార్థులను అభినందిస్తున్న ఏజీఎం సుబ్బారెడ్డి



నారాయణ స్కూల్‌లో ఏజీఎం రమేష్‌బాబుతో విద్యార్థులు

సర్పంచ్ సెలవు

● ఉపసర్పంచ్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్ సెలవు పెట్టడం ఏమిటి అనుకుంటున్నారా? అవును మండలంలోని చిన్నంపల్లి సర్పంచ్ శివశంకర్ సెలవు పెట్టారు. శుక్రవారం నుంచి జూన్ 5వ తేదీ వరకు వ్యక్తిగత పనుల నిమిత్తం అమెరికా వెళ్లనున్నారు. ఆ మేరకు 42రోజుల పాటు సెలవు మంజూరు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడిని కోరారు. ఈ క్రమంలోనే సదరు అధికారి.. సర్పంచ్‌కు సెలవు మంజూరు చేశారు. దీంతో ఉపసర్పంచ్ లక్ష్మీదేవికి ఇన్‌చార్జి బాధ్యతలు నియమించారు. నిబంధనల ప్రకారం సర్పంచులెవరైనా దేశాన్ని విడిచివెళ్లేందుకు 20రోజుల వరకు అనుమతులు ఉన్నట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. అంతకుమించి వెళితే సెలవుపెట్టి వెళ్లాలని నిబంధనలు ఉన్నట్లు సంబంధిత అధికారవర్గాలు అంటున్నాయి. ఈక్రమంలోనే చిన్నంపల్లి సర్పంచ్ సెలవుకోసం పంచాయతీ అధికారులను సంప్రదించి, నిబంధనల ప్రకారం సెలవు తీసుకుని వెళ్లారు.




ఉత్తమ మార్కులు సాధించిన విజయలక్ష్మిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

● నార్పల: మండలంలోని మొత్తం 12 పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు 71శాతం ఉత్తీర్ణత సాధించనట్లు ఎంఈఓ తెలిపారు. నే తాజీ పాఠశాలకు చెందిన విజయలక్ష్మి 582 మా ర్కులు సాధించింది. నా ర్పల ప్రభుత్వ బాలుర పాఠశాలలో మదన్‌కుమార్ 518 మార్కులు, కేశేపల్లి జడ్పీ గంగోత్రి 566, గూగూడు జడ్పీ ఉన్నత పాఠశాలలో పృథ్వీనాథ్ 576, బండ్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశా లలో ఆసిఫ్ 458 మార్కులు సాధించారు. పప్పూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో చరిత 578, నార్పల కేజీబీవీలో నిహారిక 557, పప్పూరు గురుకుల పాఠశాలలో సాయిదీక్షిత 577, నార్పల నేతాజీ పాఠశాలలో నాగచైతన్య 578 మార్కులు సాధించారు ఎల్ఎస్ఆర్ డబ్ల్యూ పాఠశాలలో శారద 562, సరస్వతీ విద్యామందిరం శృతి 560, నితీష్‌కుమార్ 571 మార్కులు సాధించారు.



ప్రేక్షిత గాయత్రి యోక్షిత

● కనగానపల్లి: పది పలితాల్లో మండల బాలికలు సత్తా చాటారు. కనగానపల్లి మోడల్‌స్కూల్ విద్యార్థిని ప్రేక్షిత 563 మార్కులు, కనగానపల్లి జడ్పీ పాఠశాల విద్యార్థిని గాయత్రి 545, మామిళ్లపల్లి జడ్పీ పాఠశాల విద్యార్థిని యోక్షిత 543 మార్కులు సాధించారు. అదేవిదంగా చంద్రాచెర్ల గ్రామానికి చెందిన విద్యార్థిని కోడూరు ప్రణవి అనంతరపురంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదివి 595 మార్కులు సాధించడంతో గ్రామస్థులు ఆ విద్యార్థినిని అభినందిచారు.



హరినాథ్

● రామగిరి: పదో తరగతి పరీక్షా ఫలితాలలో మండల వ్యాప్తంగా ఉన్న తొమ్మిది ఉన్నతపాఠశాలలో 80శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ఎంఈఓ శ్రీనివాసులు తెలిపాఋ. బాలికల, బాలుర గురు కుల పాఠశాలలో అత్యధిక శాతం ఉత్తీర్ణత సాధించారు. నసనకోటలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో 117 మందికి గాను 115 మంది, పేరూరులోని మహాత్మాజ్యోతిబా పూలే బాలుర గురకుల పాఠశాలలో 71 మందికిగాను 67 మంది, కేజీబీవీలో 40 మందికి గాను 37 మంది ఉత్తీర్ణత సాధించారు. పేరూరు బాలుర గురుకుల పాఠశాలకు చెందిన హరినాథ్ 585మార్కులు, పేరూరు గురుకుల పాఠశాలకు చెందిన మోహన్ 582, నసనకోట గురుకుల పాఠశాలకు చెందిన శ్వేత 582 మార్కులు సాధించారు. ఫణీంద్ర 578 మార్కులు సాధించాడు.



యశస్విని చరణ్

● చెన్నేకొత్తపల్లి: పదో తరగతి ఫలితాల్లో మండలంలో ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం తగ్గింది. 49.06 శాతం ఫలితాలు వచ్చినట్టు ఎంఈఓ-2 ప్రసూన్ కుమార్‌నాయుడు తెలిపారు. గత ఏడాది 60శాతం రాగా ఈ ఏడాది తగ్గిందని ఆయన తెలిపారు. మొత్తం ఏడు ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూల్‌లో 430 మంది పరీక్షలు రాయగా 211 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. ముఖ్యంగా నాగసముద్రంలో 11మందికి గాను కేవలం ఒక్కరు మాత్రమే పాసయ్యార తెలిపారు. అదేవిధంగా చెన్నేకొత్తపల్లిలో 66 మంది విద్యార్థులకు గాను ఎనిమిది మంది పాసయ్యారన్నారు. అయితే పలువు విద్యార్థిలు ప్రతిభ కనబరిచారు. మేడాపురం జడ్పీ హెచ్ఎస్ విద్యార్థిని యసస్విని 577, జడ్పీహెచ్ఎస్ కనుముక్కల విద్యార్థి చరణ్ 577మార్కులు సాధించారు. న్యామద్దల జడ్పీహెచ్ఎస్ విద్యార్థి నరేంద్ర 571, మేడాపురం ప్రశాంత్ 566 మార్కులు సాధించారు.



హసని

● బుక్కరాయసముద్రం: మండలంలో ఈ ఏడాది పదోతరగతి ఫలితాల్లో గతేడాది కంటే ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ఉత్తీర్ణత శాతం తగ్గింది. అత్యధికంగా బుక్కరాయసముద్రం కేజీబీవీ విద్యార్థులు 88.82 శాతం ఉత్తీర్ణత సాధించగా కొర్రపాడు గురుకల బాలికల పాఠశాల విద్యార్థులు 87 శాతం, బుక్కరాయసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 56 శాతం, సిద్దరాంపురం జడ్పీ పాఠశాల 62 శాతం, రోటరీపురం పాఠశాల 47.54 శాతం, వెంకటాపురం 64 శాతం, కొర్రపాడు 47 శాతం, ట్రైబుల్ వెల్ఫర్ పాఠశాల 75శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలో 482 మంది విద్యార్థులకు గాను 314 మంది ఉత్తీర్ణత సాధించారు. బుక్కరాయసముద్రం కేజీబీవీ విద్యార్థిని హసని (557) మార్కులు సాధించింది.

అమ్మపడుతున్న కష్టాలే గుర్తుకొచ్చేవి

● పదో తరగతి విద్యార్థిని కావ్యశ్రీ



నార్పల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): అమ్మ పడుతున్న కష్టాలే నాకు ఎప్పుడూ గుర్తుకు వచ్చి కసితో బాగా చదినానని విద్యార్థిని కావ్యశ్రీ పేర్కొంది. మండల పరిధిలోని బొందలవాడ గ్రామానికి చెందిన కావ్యశ్రీ పదోతరగతి ఫలితాలలో 586 మార్కులు సాధించింది. కావ్యశ్రీ బీఆర్ అంబేడ్కర్ రాజాపురం గురుకుల పాఠశాలలో చదువుతోంది. ఆమెతల్లి లక్ష్మీదేవి పప్పూరు గురుకుల పాఠశాలలో స్వీపర్‌గా పనిచేస్తోంది. తండ్రి కాటమయ్య ఆరేళ్ల క్రితం ఆనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటినుంచి తల్లి లక్ష్మీదేవి పడుతున్న కష్టాన్ని కళ్లార చూసిన కావ్య ఎంతో కష్టపడి చదివింది. కష్టానికి ఫలితంగా పదో తరగతిలో మంచి మార్కులు సాధించింది. కావ్యశ్రీ అత్యధిక మార్కులు సాధించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. కావ్యశ్రీని వెంకట్ వకుళ ఫౌండేషన్ చైర్మన్ ఆలం వెంకటనరసానాయుడు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు అభినందించారు.

రైతు బిడ్డకు 590



భానుచరణ్

రాప్తాడు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొందిరెడ్డిపల్లికి చెందిన రైతు పసుపుల శంకర్, కమలమ్మ దంపతుల కుమారుడు పసుపుల భానుచరణ్ పది పరీక్షల్లో 590 మార్కులు సాధించాడు. భానుచరణ్ గార్లదిన్నె మండలం లోలూరు సమీపంలో గల ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదివాడు.

పార్టీ కోసం పనిచేయాలి: ఎమ్మెల్యే



నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అనంతపురం రూరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ మ నకు ఎంతో గౌరవాన్ని, ఎన్నో పదవుల్ని ఇచ్చిం దని, మనం కూడా పార్టీ కోసం అదే విధం గా పనిచేయాలని ఎ మ్మెల్యే పరిటాల సునీత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో రాప్తాడు నియోజకవర్గంలో ఆరు మండలాల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..టీడీపీ సభ్యత్వ నమోదు కార్డు పంపిణీలో నియోజకవర్గం రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉందన్నారు. ఇది మీ కృషి వలనే సాధ్యమైందన్నారు. అలాగే సీఎం చంద్రబాబు ఆదేశాలమేరకు ప్రతి నియోజకవర్గంలో కుటుంబ సాధికార సారధుల నియామకం చేయాల్సి ఉందన్నారు. ఈప్రక్రియ ఇప్పటికే పూర్తి కావాల్సి ఉన్నా.. కొన్ని చో ట్ల నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. కో-కన్వీనర్లు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జిల నియామకం కూడా చేయాల్సి ఉందన్నారు. ఓటర్ జాబితాలో చేర్పులు, మార్పులపై కూడా దృష్టి సారించాలన్నారు.

టెన్త్ ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల సత్తా


పూజిత (583) రుషిత (559) రుక్సానా (542) కావ్యశ్రీ (586) సంతోష్ (583)

గుత్తి/గుత్తిరూరల్ ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్ష ఫలితాలు బుధవారం వెలువడ్డాయి. ఇందులో మండలంలో 73శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ రవినాయక్ తెలిపారు. మండల వ్యాప్తంగా 1357మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 988 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. పట్టణంలోని కేజీబీవీలో వందశాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ఇక మోడల్ స్కూల్లో నరసింహ అనే విద్యార్థి అత్యధికంగా 593మార్కులు సాధించారన్నారు. అదేపాఠశాలకు చెందిన వైష్ణవి 586, కిరణ్‌కుమార్ 585, కే హర్షవర్ధన్ 578, కోట జిల్లా ఉన్నత జిల్లా పరిషత్ పాఠశాలలో పూజిత 583, కేజీబీవీలో రుషిత 559, రుక్సానా 542 మార్కులు సాధించినట్లు చెప్పారు. మండలంలోని రజాపురంలో గల ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్‌లో 99 శాతం ఉతీర్ణత సాధించారన్నారు. అందులో అత్యధికంగా కావ్యశ్రీ 586 మార్కులు సాధించిందన్నారు. సేవాఘడ్‌లోని గిరిజన గురుకుల బాలుర పాఠశాల సంతోష్ 583 మార్కులు సాధించినట్లు చెప్పారు.

ప్రతిభ చాటిన హావళిగి జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు..


నరసింహారెడ్డి (575) హావళిగి జడ్పీహెచ్ఎస్

విడపనకల్లు: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మండలంలోనే హావళిగి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారు. ఆ పాఠశాలలో 117 మందికి గాను 52 మంది ఉత్తీర్ణత సాధించారు. అందులో జీ.నరసింహారెడ్డి 575, మనోజ్ 549, వర్షిణి 538 మార్కులు సాధించారు. ఇక మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 68 మంది విద్యార్థులకు 41 మంది ఉత్తీర్ణులయ్యారు. కేజీబీవీలో 40 మందికి గాను 26 మంది ఉత్తీర్ణులయ్యారు. విడపనకల్లు జడ్పీహెచ్ఎస్‌లో 80 మందికిగాను 30 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. గడేకల్లు జెడ్పీహెచ్ఎస్‌లో 135 మందికి గాను 75 మంది ఉత్తీర్ణులయ్యారు. పెద్దకొట్టాలపల్లి జెడ్పీ హెచ్ఎస్‌లో 8 మందికి గాను ఆరుగురు ఉత్తీర్ణులయ్యారు. చీకలగురికి జెడ్పీహెచ్ఎస్‌లో 24 మందికి గాను ఐదుగురు మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. కరకముక్కల జడ్పీహెచ్ఎస్‌లో 26 మందికి గాను 16 మంది ఉత్తీర్ణులయ్యారు. పాల్తూరు జెడ్పీహెచ్ఎస్‌లో 123 మందికి 58 మంది ఉత్తీర్ణులయ్యారు.

పామిడి మండలంలో..


పీట్ల మను (594)

పామిడి: పదో తరగతి ఫలితాల్లో మండల విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. మండలకేంద్రంలోని కేజీబీవీ విద్యార్థినులు 90 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు 81శాతం, ఖాదర్‌పేట జడ్పీ హైస్కూల్ విద్యార్థులు 60.4 శాతం, ఎద్దులపల్లి జడ్పీ హైస్కూల్ విద్యార్థులు 55.2శాతం, పామిడి టీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు 50శాతం, పామిడి జడ్పీ హైస్కూల్ విద్యార్థులు 43.3శాతం ఉత్తీర్ణత సాధించారు. పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల్లో సరస్వతీ విద్యా మందిరంలో 95.2 శాతం, శ్రీచైతన్య హైస్కూల్‌లో 93.6శాతం, ట్రినిటీ హైస్కూల్‌లో 93.3 శాతం, ఎస్ఎఫ్ఎస్ హైస్కూల్‌లో 92.8శాతం, విజ్ఞాన్ హై స్కూల్ 86.7శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎస్ఎఫ్ఎస్ ప్రైవేట్ పాఠశాలకు చెందిన పీట్ల మను అనే విద్యార్థి మండలంలో అత్యధికంగా 594 మార్కులు సాధించాడు.

కళ్యాణదుర్గంలో..


వీణ (583) ఆనంద్ కిషోర్ (569) అలేఖ్య (568)

కళ్యాణదుర్గం రూరల్: పది ఫలితాల్లో పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తాచాటారు. కరణం చిక్కప్ప ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని వీణ మండలంలోనే అత్యధికంగా 583మార్కులు సాధించింది. అలాగే బీ.ఆనంద్ 569, కిషోర్ 569, అలేఖ్య 568 మార్కులు సాధించారు. ఆ పాఠశాలలో 48 శాతం ఉత్తీర్ణత రాగా 21 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించినట్లు హెచ్ఎం గంధనేని శ్రీనివాసులు తెలిపారు. ఇక కేజీబీవీలో 68 శాతం ఉత్తీర్ణత రాగా నలుగురు 500కు పైగా మార్కులు సాధించారు. ఏపీ మోడల్ స్కూలులో 59 శాతం ఉత్తీర్ణత వచ్చినట్లు హెచ్ఎం నాగరాజు తెలిపారు. అందులో టీ భావన 575, జీ జ్యోత్స్న 572, వి గణేష్ 568 మార్కులు సాధించినట్లు చెప్పారు.

యల్లనూరులో..


ఎన్. హరిప్రియ (583)

యల్లనూరు: మండలకేంద్రంలోని శ్రీ శారదా విద్యా మందిరం విద్యార్థిని పాలెం భవిత మండలంలోనే అత్యధికంగా 591మార్కులు సాధించింది. చిలమకూరు ఆదర్శపాఠశాల విద్యార్థిని ఎన్. హరిప్రియ 583మార్కులు సాధించింది. తిమ్మంపల్లి జడ్పీహైస్కూల్ విద్యార్థి వినయ్‌కుమార్ 565 మార్కులు, వెన్నపూసపల్లి జడ్పీస్కూల్ విద్యార్థి 540మార్కులు, కేజీబీవీలో శివప్రవతి 535 మార్కులు సాధించారని ఎంఈఓ చంద్రశేఖర్ తెలిపారు.

పుట్లూరులో..


వి. అక్షయ (568) రుచిత (565)

పుట్లూరు : మండలంలోని ఐదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఆదర్శపాఠశాల, కేజీబీవీ పాఠశాలలకు చెందిన 260మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలు రాయగా 172మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ శ్రీదేవి తెలిపారు. ఆదర్శపాఠశాలలో 74మంది పరీక్ష రాయగా 67మంది పాసై 91శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. కేజీబీవీలో 36మంది పరీక్ష రాయగా 32మంది పాసై 89శాతం ఉత్తీర్ణత పొందారు. ఆదర్శ పాఠశాలలో వి. అక్షయ 568మార్కులు, ఎ. రుచిత 565మార్కులు, మంజునాథరెడ్డి 559, హార్దిక్ కుమార్ 559, కేజీబీవీలో చందన 547మార్కులు, తేజశ్విని 524 మార్కులు పొందినట్లు తెలిపారు.

పెద్దపప్పూరులో..


చంద్రిక (588)

పెద్దపప్పూరు: మండలకేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన కమలాకర్‌రెడ్డి టెన్త్ పరీక్ష ఫలితాల్లో 578 మార్కులు సాధించారు. అలాగే స్థానిక సాయిరాం హైస్కూల్‌లో చదువుతున్న చంద్రిక మండలంలోనే అత్యధికంగా 588మార్కులు సాధించిందని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

కుందుర్పిలో..


గురుచరణ్ (539)

కుందుర్పి: మండలంలో 13 ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు 498 మంది పరీక్షలు రాయగా 308 మంది ఉత్తీర్ణత సాధించారు. అందులో కేజీబీవీలో అత్యధికంగా 83 శాతం.. నిజవళ్లి ఉన్నత పాఠశాలలో అత్యల్పంగా 33 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎనుములదొడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సింధు మండలంలోనే అత్యధికంగా 562 మార్కులు సాధించింది. అలాగే ఆమె సోదరి ప్రియాంక కూడా 554 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచింది. ఇక తెనగల్లు ఉన్నత పాఠశాలలో గురుచరణ్ 539 మార్కులు సాధించాడు.

పది ఫలితాల్లో కునుకూరు ఫస్ట్..


మహేష్ (584)

శెట్టూరు: మండలంలో జరిగిన పదవ తరగతి పరీక్షల ఫలితాల్లో కనుకూరు ఫస్ట్ ఉండగా శెట్టూరు లాస్ట్‌కు చేరింది. మండలంలో మొత్తం 12 ఉన్నత పాఠశాలల నుండి 440 మంది విద్యార్థులు పరీక్షలురాయగా 254 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అందులో కనుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వంద శాతం ఫలితాలు సాధించగా మండల కేంద్రంలోని శెట్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 20 శాతం ఉత్తీర్ణత సాధించి అత్యల్ప స్థానంలో నిలిచింది. లక్ష్మంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన మహేష్ అను విద్యార్థి 600 మార్కులకు గాను 584 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచాడు. చెర్లోపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన చందన 562 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచారు.

ఘనంగా కొల్లాపురమ్మ దేవర


అమ్మవారిని దర్శించుకుంటున్న కాలవ శ్రీనివాసులు తదితరులు

రాయదుర్గం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొంతానపల్లి గ్రామంలో కొల్లాపురమ్మ ఊరుదేవర బుధవారం గ్రామపెద్దల ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పూజారులు స్థానిక ఆలయంలో అమ్మవారికి మంగళవారం అర్ధరాత్రి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉదయం భక్తులు పెద్దఎత్తున ఆలయం వద్ద బోనాలు సమర్పించి జంతుబలులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్, గ్రంథాలయమాజీ చైర్మన్ గౌస్‌మొయిద్దీన్, రాష్ట్ర కార్యదర్శి గంజి నాగరాజు గ్రామానికి చేరుకొని అమ్మవారి దర్శించుకుని ప్రత్యేకపూజలు చేయించారు. దేవరకు ప్రతి ఇంటికీ బంధుమిత్రులు రావడంతో గ్రామంలో సందడి నెలకొంది. టీడీపీ కన్వీనర్ హనుమంతు, వైస్ సర్పంచ్ మారేష్, మాజీ సర్పంచ్ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

మండల సమావేశంలో సమస్యలపై నిలదీత

యాడికి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ ఉమాదేవి అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో అధికారులు వారి వారి శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఉపాధిహామీ పథకం ఏపీఓ మద్దిలేటి ప్రగతి నివేదిక చదివే సమయంలో వైస్ ఎంపీపీ చెన్నప్ప నిలదీశారు. ఫీల్డ్ అసిస్టెంట్లు ఫీల్డ్‌లోకి వెళ్లకుండా ఇంటిలో ఫ్యాన్ల కింద పడుకొని హాజరు వేస్తున్నారని, ఇలా అయితే బోగస్ కూలీలను ఎలా అరికడతారంటూ ప్రశ్నించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు ఫీల్డ్‌లోకి వెళ్లి ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయడం లేదని, ఇతరులను ఉపాధిహామి పనుల వద్దకు పంపి ఫొటోలు తీయించుకొని వాట్సాప్ చేయించుకుంటున్నారని తెలిపారు. దీనిపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని ఏపీఓ బదులిచ్చారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

కుందుర్పి: మండల కేంద్రంలోని మండల అభివృద్ధి కార్యాలయంలో ఎంపీపీ కమలమ్మ అధ్యక్షతన సాధారణ సర్వసభ్యసమావేశం ఏర్పాటు చేశారు. ఇందులో పలువురు సభ్యులు తమ గ్రామాల్లో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీడీవో లక్ష్మీశంకర్, ఈవోపీఆర్డీ హరి, వైస్‌ఎంపీపీ భీమ్‌రెడ్డి, ఆయా శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సెయింట్ పీటర్స్ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ


చైత్ర (591) లక్ష్యప్రజ్ఞ (591) సఫియా అంజుం (584) సుమంత్ (579) సాయియశస్వి (578)

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో పట్టణంలోని సెయింట్ పీటర్స్ హైస్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని కరస్పాండెంట్ చాకోచన్ తెలిపారు. చైత్ర 591, లక్ష్యప్రజ్ఞ 591, సఫియా అంజుం 584, సుమంత్ 576, సాయియశస్వి 578, హర్షవర్ధిని 575 మార్కులు సాధించినట్లు చెప్పారు. అలాగే 32మంది విద్యార్థులు సాధించారు. 500మార్కులకు పైగా సాధించారన్నారు. 100శాతం ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు.

సత్తాచాటిన ఎంజేబీ గురుకుల బాలికలు


అనూష, 580 కీర్తన, 572

గుమ్మఘట్ట, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పది ఫలితాల్లో గోనబావి ఎంజేబీ గురుకుల బాలికలు సత్తా చాటారు. 118 మంది గాను 109 మంది ఉత్తీర్ణత సాధించగా వీరిలో 49 మంది 500 పైగా మార్కులు సాధించారు. అందులో అనూష మండలంలోనే అత్యధికంగా 580 మార్కులు సాధించింది. అలాగే కీర్తన 572 మార్కులు సాధించింది. మండలకేంద్రంలోని కేజీబీవీలో 36 మందికిగాను 21 మంది, రంగచేడు పాఠశాలలో 28 మందికిగాను 16 మంది, పూలకుంటలో 31 మందికి 16 మంది, నేత్రపల్లిలో 71 మందికి 35 మంది, కలుగోడులో 20 మందికి 8 మంది, భూపసముద్రంలో 19 మందికి 12 మంది, గొల్లపల్లిలో 92 మందికి 26 మంది, గుమ్మఘట్టలో 35 మందికి 13 మంది, గోనబావిలో 43 మందికి 21 మంది, తాళ్లకెరలో 52 మందికి 13 మంది ఉత్తీర్ణత సాధించారు.

రాయదుర్గంలో..


దిలీప్, 574 వసుంధర, 527

రాయదుర్గం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్ష ఫలితాలలో ఆవులదట్ల పాఠశాల విద్యార్థి దిలీప్ 574 మార్కులు సాధించాడు. అదే పాఠశాలకు చెందిన గణేష్ 553, హరితబాయ్ 528 మార్కులు సాధించారు. జుంజురంపల్లి పాఠశాలకు చెందిన సోఫియాబీ 535, తిప్పేసి 531, లావణ్య 502 మార్కులు సాధించారు. 74 ఉడేగోళం పాఠశాలకు చెందిన వసుంధర 527, నవ్య 460 మార్కులు సాధించారు. మండలంలో ఏడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 265 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 119 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ నాగమణి తెలిపారు. దీంతో 44.90 ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు.

బ్రహ్మసముద్రంలో 53.19 శాతం ఉత్తీర్ణత


వీ చందన (555) దీక్షిత (546)

బ్రహ్మసముద్రం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్ష ఫలితాలలో మండలంలో 53.19 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో ఓబుళపతి తెలిపారు. మండలవ్యాప్తంగా 470 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 250 మంది ఉత్తీర్ణత సాధించారు. మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల 76 శాతంతో మొదటి స్థానం రాగా 36 శాతంతో గుండిగానిపల్లి చివరన నిలిచింది. పిల్లలపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని వీ. చందన 555 మార్కులు సాధించింది. సంతే కోనాపురం ఉన్నత పాఠశాల విద్యార్థిని దీక్షిత 546 మార్కులు, గురుకుల పాఠశాల విద్యార్థిని జయచంద్రిక 535 మార్కులు సాధించారు.

బెళుగుప్ప మండలంలో బాలికలదే హవా


వై ఈశ్వరి, (574) ఫౌజియా (563) మేఘన (534) హర్షవర్ధన్ (563)

బెళుగుప్ప, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల ఫలితాల్లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలే హవా కొనసాగించారు. మండల వ్యాప్తంగా 399 మంది పరీక్షలు రాయగా 241 మంది ఉత్తీర్ణులై 60 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు విద్యాశాఖాధికాధికారి మల్లారెడ్డి తెలిపారు. బెళుగుప్ప ఉన్నత పాఠశాల విద్యార్థిని వై ఈశ్వరి మండలంలో అత్యధికంగా 574 మార్కులు సాధించింది. అలాగే మధుశ్రీ 568 మార్కులు సాధించింది. గంగవరం పాఠశాల విద్యార్థిని ఫౌజియా 563 , కేజీబీవీ విద్యార్థిని మేఘన 534 మార్కులు సాధించారు. శ్రీనివాస విద్యానికేతన్ ప్రైవేటు పాఠశాల విద్యార్థి హర్షవర్ధన్ 563 మార్కులు సాధించాడు.

ఆర్థికసాయం అందజేత

ఉరవకొండ, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దముష్టూరుకుచెందిన టీడీపీ కార్యకర్త నాగరాజు పదిరోజుల క్రితం గుండెపోటుతో మరణించారు. ఆయన కుటుంబసభ్యులను టీడీపీ నాయకులు బుధవారం పరామర్శించారు. అనంతరం పయ్యావుల సోదరుల సహకారంతో రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు. మండల కన్వీనర్ విజయ్‌భాస్కర్, నాయకులు నెట్టెంరాంబాబు, నర్రాకేశన్న తదితరులు పాల్గొన్నారు.

రాణించిన ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు

తాడిపత్రి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాలలు 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచాయి. స్థానిక యల్లనూరురోడ్డులో ఉన్న శ్రీవాణి హైస్కూల్ విద్యార్థులు చరణ్‌సాయిగణేష్ 593, వికాస్ 593, జాహ్నవి 593, యోగేశ్వరి 592, మోహన్‌రెడ్డి 590, లక్ష్మీపార్వతి 590 మార్కులు సాధించారని విద్యాసంస్థల చెర్మన్ గంగాధర్, కరెస్పాండెంట్ కార్తీక్ తెలిపారు. విజయనగర్‌కాలనీలోని పద్మవాణి పాఠశాల విద్యార్థులు అమృత 587, రూప 584 మార్కులు సాధించినట్లు కరెస్పాండెంట్ నాగపీరయ్య తెలిపారు. గన్నెవారిపల్లికాలనీలోని సర్‌విశ్వేశ్వరయ్య పాఠశాల విద్యార్థులు భార్గవి 590, భావన కన్వార్ 589, నాగసులోచన 584, శ్రావణి 583 మార్కులు సాధించారని కరెస్పాండెంట్ రవిప్రకాష్ తెలిపారు. యల్లనూరురోడ్డులో ఉన్న టార్గెట్ పాఠశాల విద్యార్థులు భానుప్రకాష్ 594 , రమ్యశ్రీ 593, వైష్ణవి 591, షబియా అనుజున్ 590 మార్కులు సాధించినట్లు కరెస్పాండెంట్ జయచంద్ర తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సత్తా..

పట్టణ సమీపంలోని ఏపీ మోడల్‌స్కూల్ విద్యార్థులు టెన్త్ ఫలితాల్లో మంచి ప్రతిభ చూపారని ప్రిన్సిపాల్ లావణ్య తెలిపారు. అత్యధికంగా రాగ ద్రాక్షణ్య 591, రమ్యశ్రీ 583, శివలక్ష్మి 583 మార్కులు సాధించినట్లు ఆమె చెప్పారు. అలాగే టైలర్స్‌కాలనీలోని ప్రకాశం మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు షేక్ అబ్దుల్‌హఫీజ్ 579, రంగజయదేవ్ 573, చరణ్ 569 మార్కులు సాధించారు. త్రిబుల్‌ఎస్ హైస్కూల్ విద్యార్థులు విష్ణు 573, యశ్వంత్ ఆచారి 572, వేదవతి 562 మార్కులు సాధించారు. జేసీఎస్‌ఆర్ఎం బాయ్స్‌హైస్కూల్ విద్యార్థులు మహబూబ్‌జాన్ 560, ముస్కాన్ 560, అశోక్ 548మార్కులు సాధించారు. కేజీబీవీ విద్యార్థినీలు రాజేశ్వరి 556, కీర్తి 551 మార్కులు సాధించారు. గర్ల్స్ హైస్కూల్ విద్యార్థినులు రష్మినా 570, ఖాజాబన్ని 563మార్కులు సాధించారు. పెద్దపొలమడ జడ్పీహైస్కూల్ విద్యార్థులు లావణ్య 578, యమున 574, రంజిత్‌గౌడ్ 574మార్కులు సాధించారు. చుక్కలూరు జడ్పీహైస్కూల్ విద్యార్థి ప్రవీణ్‌కుమార్ 561మార్కులు సాధించారు. సజ్జలదిన్నె జడ్పీహైస్కూల్ విద్యార్థి ముస్కిన్ 549మార్కులు, యర్రగుంటపల్లి జడ్పీహైస్కూల్ విద్యార్థిని నిఖిత 504మార్కులు సాధించింది.


చరణ్‌సాయిగణేష్ (593) జాహ్నవి (593) అమృత (587) రూప (584) భార్గవి (590) భానుప్రకాష్ (594) రాగద్రాక్షణ్య (591) మహబూబ్‌జాన్ (560)

విద్యార్థినుల ప్రతిభ


చంద్రిక,577 యువలక్ష్మి, 574

పెద్దవడుగూరు, ఏప్రిల్23(ఆంధ్రజ్యోతి): మండలంలోని దిమ్మగుడి గ్రామంలోని జడ్పీహెచ్ఎస్‌కు చెందిన పదోతరగతి విద్యార్థిని పి. చంద్రిక 577, లక్షుంపలి జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని యువలక్ష్మి 574మార్కులు సాధించారు. వీరిని ఎంఈఓ రాముడు అభినందించారు.

వాగ్దేవి హైస్కూల్ విద్యార్థికి 594


సోహిత్ 594

యాడికి: స్థానిక వాగ్దేవి హైస్కూల్ విద్యార్థి సోహిత్ మండలంలోనే అత్యధికంగా 594మార్కులు సాధించాడు. అతడిని ఉపాధ్యాయులు అభినందించారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

బ్రహ్మసముద్రం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఎస్ కోనాపురానికి చెందిన దుర్గన్న అనారోగ్యంతో మృతి చెందారు. ఎమ్మెల్యే అమిలినేని సూచనతో స్థానిక సర్పంచ్ వనిత అతడి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబానికి రూ. ఏడు వేలు ఆర్థికసాయం అందజేశారు.

60.82 శాతం ఉత్తీర్ణత


కావ్యశ్రీ 590 గణేష్‌రెడ్డి 584

కణేకల్లు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలో 970 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయగా 590 మంది పాసై 60.82 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ లక్ష్మణ్ తెలిపారు. ఇందులో మండలంలోనే అత్యధికంగా కణేకల్లు క్రాసింగ్‌లోని విద్యానికేతన్ పాఠశాలకు చెందిన కావ్యశ్రీ 590 మార్కులు సాధించింది. అలాగే నేషనల్‌స్కూల్‌కు చెందిన ముస్కాన్ 589 మార్కులు సాధించాడు. ఇక ప్రభుత్వ పాఠశాలకు సంబంధించి హనుకనహాళ్ జెడ్పీ పాఠశాలకు చెందిన గణేష్‌రెడ్డి 584 మార్కులు సాధించాడు.

భారీగా తగ్గిన ఉత్తీర్ణత శాతం


జయసూర్యరెడ్డి (556)

కూడేరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్ష ఫలితాల్లో మండలం వెనుకబడింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఉత్తీర్ణత శాతం పూర్తిగా తగ్గిపోయింది. మండల వ్యాప్తంగా ఆరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతోపాటు కేజీబీవీలో పదో తరగతి చదువుతున్న 280 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. అందులో కేవలం 95 మంది మాత్రమే పాసవడంతో 34 శాతం ఉత్తీర్ణత వచ్చింది. కరుట్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన జయసూర్యరెడ్డి అత్యధికంగా 556 మార్కులు సాధించాడు. గత ఏడాది 70 శాతం ఉత్తీర్ణత సాధిస్తే.. ఈ సారి మాత్రం కేవలం 34 శాతానికి పడిపోయింది. కొన్నేళ్లుగా కరుట్లపల్లి, మరుట్ల, జల్లిపల్లి పాఠశాల్లో ఉత్తీర్ణ శాతం గణనీయంగా ఉండేది. ఈ ఏడాది భారీగా తగ్గిపోవడంతో ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ


యుగంధర్ (584) మహమ్మద్‌ఆఫ్రిద్ (584) రిజ్వాన (584) పూజ (573) దీవికా (563)

ఉరవకొండ ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చూపారు. మండలవ్యాప్తంగా 942మంది పరీక్షలు రాయగా 495మంది పాసయ్యారు. 52.5శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ ఈశ్వరయ్య తెలిపారు. పట్టణంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలలో 94.7శాతం, అంబేడ్కర్ బాలిక ల గురుకుల పాఠశాలలో 92.3 శాతం ఉత్తీర్ణత, మోడల్ స్కూల్ 55.7 శాతం ఉత్తీర్ణత సాధించారు. అందులో యుగంధర్, మహమ్మద్ ఆఫ్రిద్‌లు అత్యధికంగా 584 మార్కులు సాధించారు. అలాగే ఎస్కే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రిజ్వాన 584, జిల్లా పరిషత్ సెంట్రల్ ఉన్నత పాఠశాలలో పూజ 573, కేజీబీవీలో దీవికా 563, పెన్నహోబిలం బీసీ గురుకుల పాఠశాలలో గుణశేఖర్ 571 మార్కులు సాధించారు.

వజ్రకరూరు: మండలంలో 49శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మండల వ్యాప్తంగా 552మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 272 పాసయ్యారు. మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన శృతి అత్యధికంగా 570మార్కులు సాధించింది. చిన్నహోతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన రుక్సాన 569మార్కులు సాధించింది.

నిరాశపరిచారు..


విజ్ఞాకార్తీక 575

బొమ్మనహాళ్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలో టెన్త్ ఫలితాలు నిరాశ పరిచాయి. మండలవ్యాప్తంగా 742 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 326 మంది మాత్రమే పాసయ్యారు. దీంతో 44శాతం ఉత్తీర్ణత వచ్చింది. కేజీబీవీలో 40 మందికి 33 మంది పాసై 83శాతం ఉత్తీర్ణత సాధించారు. ఉద్దేహాళ్ జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన విజ్ఞాకార్తీక మండలంలోనే అత్యధికంగా 575మార్కులు సాధించింది. అలాగే అమృతలక్ష్మీ 572 మార్కులు సాధించింది. ప్రైవేట్ పాఠశాలలో ప్రతిభ స్కూల్లోలో 64 మందికిగాను 48 మంది పాసయ్యారు. మేధా స్కూల్లో 9 మందికి 9 మంది పాసయ్యారు. శ్రీమారుతి స్కూల్లో 15 మందికి 13 మంది పాసయ్యారు. గుడ్‌షేఫర్డ్‌లో 7 మందికి 7 మంది పాసయ్యారు.

నేడు కంటి వైద్యశిబిరం

కణేకల్లు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చిక్కణ్ణేశ్వర కళ్యాణ మంటపంలో గురువారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వేలూరు మరియప్ప తెలిపారు. ప్రజలు విని యోగించుకోవాలని కోరారు.

